జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉండే కలెక్టరేట్ కొత్త భవనాల నిర్మాణం కలగానే మారుతోంది. కొన్నేళ్ల తర్వాత కోర్టులో కేసులు క్లియర్ అయినా కొత్త కలెక్టరేట్ నిర్మాణం ఇప్పట్లో లేనట్లేనా..? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎనిమిదేళ్ల కోర్టు కేసుల అనంతరం రెండేళ్ల క్రితం లైన్ క్లియర్ అవ్వడంతో సుమారు రూ.58 కోట్లతో 2022 సెప్టెంబరులో అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలకు ఇప్పటికీ అతీగతీ లేదు. దీంతో బ్రిటీషు కాలం నాటి భవనంలోనే పాలన సాగిస్తూ వస్తున్నారు. కొత్త భవనం నిర్మాణం జరగని కారణంగానే ఇప్పుడున్న వందేళ్ల నాటి భవనానికి విడతల వారీగా మరమ్మతులు చేస్తున్నారు. మరి ఎన్డీఏ ప్రభుత్వంలోనైనా కొత్త కలెక్టరేట్ నిర్మాణం సాధ్యపడు తుందా..? మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుంటారా..? అన్నది చూడాలి.

కొత్త కలెక్టరేట్

అంచనాలకు లభించని అనుమతులు

ఇక కలేనా!?

- వందల ఏళ్లనాటి భవనం నుంచే జిల్లా పాలన
- టీబీ ఆసుపత్రిలో భవన నిర్మాణానికి శ్రీకారం
- కోర్టు కేసులు పూర్తయినా ముందుకు సాగని ప్రక్రియ
- పాత భవనానికే మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

నెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వందేళ్ల క్రితం బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనం నుంచే ఇంకా పరిపాలన సాగుతోంది. మారుతున్న పాలనకు అనుగుణంగా అవసరాలు పెరుగుతుండటంతో ప్రస్తుతమున్న కలెక్టరేట్ భవనం ఇరుకుగా మారింది. రికార్డులు కూడా సక్రమంగా పెట్టుకోలేక అధికారులు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే నీరు కారడం, ఉరవడం, పెచ్చులు ఊడుతుండటంతో ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. బ్రిటీషు కాలం నాటి భవనంలో ఉన్న జిల్లా పోలీసు కార్యాలయానికి కూడా అధునాతన హంగులతో కొత్త భవనాన్ని నిర్మించారు. పలు శాఖల కార్యాలయాలను, పోలీసు స్టేషన్లను కూడా నూతనంగా నిర్మించారు. కానీ జిల్లా పరిపాలన కార్యాలయానికి మాత్రం మోక్షం లభించలేదు. నెల్లూరులోని పాత టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్‌ను నిర్మిస్తే పాలనాపరంగా చాలా ప్రయోజనాలు ఉంటాయని పదేళ్ల క్రితం అప్పటి అధికార వర్గాలు భావించాయి. ఇక్కడకు కలెక్టర్, జేసీ బంగ్లాలు పక్కనే ఉన్నాయి. సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో కీలకమైన జడ్పీ, డీపీవో, డ్వామా, పంచాయతీరాజ్, జిల్లా ఎమర్జెన్సీ సెంటర్ ఉండడం, కార్పొరేషన్ కార్యాలయం ఉండడం కలిసొచ్చే అంశం. దీంతో వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు అధికారులందరినీ ఒకేచోట కలవడం సులభమవుతుంది. ఇక ప్రస్తుతమున్న కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు, అధికారుల సమావేశాలకు పార్కింగ్ సమస్య కూడా ఏర్పడుతోంది. వీటన్నిటి దృష్ట్యా ట్రాఫిక్ సమస్య లేని, విశాలమైన టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్‌ను నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. అందుకు రూ.35 కోట్లతో కొత్త భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 2015లో టెండర్లు కూడా పూర్తయ్యాయి. కానీ కాంట్రాక్టర్‌కు వర్క్ అగ్రిమెంటు చేసే సమయంలో టీబీ ఆసుపత్రి స్థలం కోర్టుకెళ్లింది. దీంతో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి బ్రేక్ పడింది.



కలెక్టరేట్ భవనం నిర్మించనున్న టీబీ ఆసుపత్రి ప్రాంగణం ఇదే!



బ్రిటీష్ కాలం నాటి ప్రస్తుత కలెక్టరేట్ భవనం

● రూ.58 కోట్లతో ప్రతిపాదనలు

దాదాపు ఎనిమిదేళ్లపాటు అధికార యంత్రాంగం కోర్టులో పోరాడి విజయం సాధించింది. ఎట్టకేలకు కోర్టు కేసుల నుంచి కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి రెండేళ్ల మార్గం సుగుమమైంది. దీంతో మరోసారి అంచనాలు తయారు చేసి రూ.58 కోట్లు అవసరమంటూ పూర్వపు కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రభుత్వానికి నివేదించారు. కొత్త కలెక్టరేట్ ఆవశ్యకతను కూడా ఆయన తన నివేదికలో వివరించారు. ఈ నేపథ్యంలో నూతన పరిపాలన కేంద్రం తథ్యమని ఇటు ప్రజలు, అటు ఉద్యోగులు భావించారు. కానీ నెలలు.. ఏళ్లు గడిచినా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదు. ఎప్పటికి అనుమతులు వస్తాయో.. అసలు వస్తాయో రావో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు అవసరాలకు అనుగుణంగా కలెక్టరేట్ భవనంలో మరమ్మతులు చేయిస్తూ పాలన నెట్టుకొస్తున్నారు. కాగా ఈ అంశంపై రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులను సంప్రదించగా కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించి ఇంతవరకు ఎటువంటి అనుమతులు రాలేదని చెప్పారు.



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న కృష్ణా జలాలు

సోమశిలకు కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం నుంచి 20 వేల క్యూసెక్కులు విడుదల

నెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతుల ఆశలు ఫలించబోతున్నాయి. డెడ్ స్టోరేజీకి చేరుకున్న సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చి చేరబోతున్నాయి. 'ఇదే అదును.. కృష్ణమ్మను ఆహ్వానిద్దాం' అన్న శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. కృష్ణా జలాలను సోమశిలకు తరలించేందుకు నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తుండటంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నిప్పుల వాగుకు నీటిని విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 15 వేల క్యూసెక్కులను విడుదల చేసిన అధికారులు.. వరద ఉధృతి పెరగడంతో సోమవారం మరో 5 వేల క్యూసెక్కులను పెంచారు. ఇప్పటికే శ్రీశైలం జలాశయం 90 శాతం వరకూ నిండింది. ఎగువ ప్రాంతం నుంచి 4.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో శ్రీశైలానికి కొనసాగుతోంది. ఈ క్రమంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదలను మరింత పెంచాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన 20 వేల క్యూసెక్కుల నీరు కొంత కడప, కర్నూలు జిల్లాల్లోని కాలువలకు చేరగా, మరికొంత నిప్పుల వాగు ద్వారా పెన్నాకు చేరనుంది.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఫిర్యాదు దారులు, అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ తదితరులు

అన్నం కాదయ్యా..

ఆలకించండి!

● 'ఎస్పీ గ్రీవెన్స్'లో సమస్యల పరిష్కారమేది!? ● కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోరే! ● బాధితుల గగ్గోలు

"నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ గ్రామానికి చెందిన 434 రైతులు నవాబుపేటలోని శ్రీసాయిబాబా రైసుమిల్లు ఓనర్ శ్రీరామ్ శేఖర్ బాబును నమ్మి రోడ్డు మీద పడ్డాం. రూ.4.6 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేసి పైసా కూడా ఇవ్వలేదు. ఒకటిన్నర నెల నుంచి పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలా. ఇప్పటికి మూడు సార్లు ఎస్పీ గ్రీవెన్స్‌కి వచ్చాం.. అయినా న్యాయం జరగలా! ఇంటికి వెళ్లాలంటే అప్పులోళ్లని తలుచుకుంటేనే భయమేస్తోంది. అధికారుల్లారా మీకేం కావాలో చెప్పండి మేము ఇస్తాం. మాకు న్యాయం చేయండి."

- కొత్తకాలువ గ్రామ రైతుల ఆవేదన

నెల్లూరు(క్రైం), జూలై 29: ప్రతి సోమవారం నెల్లూరులోని ఎస్పీ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు జిల్లావ్యాప్తంగా బాధితులు వస్తూనే ఉన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు వచ్చినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పోలీసుస్టేషన్‌లో మమ్మల్ని పట్టించుకోవడం లేదనే బాధితులే అత్యధికంగా ఉంటున్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే వారి సమస్య పెరుగుతూ ఉండటంతో ఇదేదో విజయవంతమైన కార్యక్రమంలా భావిస్తున్నారు. అయితే పదే పదే సమస్యల పరిష్కారం కావడం లేదని, చార్జీలకు డబ్బులు లేకపోయినా, అప్పులు చేసి మరీ వస్తున్నా.. బాధితుల పరిస్థితులు మాత్రం పట్టించుకోవడం లేదు. అర్జీ చూశామా.. మాట్లాడామా...ఆ పరిధిలోని పోలీసుస్టేషన్‌కు రెఫర్ చేశామా అన్నట్లుగా కాలయాపన చేస్తున్నారు. అయితే, ఎవరో దానం చేసిన భోజనాన్ని బాధితులకు పెట్టి పంపుతున్నారు తప్ప వారి సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించడం లేదు.

● పరిష్కార వేదికకు 110 ఫిర్యాదులు

సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ జీ కృష్ణకాంత్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

● బెట్టింగ్ యాప్‌లను నియంత్రించండి

సింగిల్ నెంబర్ లాటరీలు, బెట్టింగ్ యాప్‌లు, దొంగతనాలను అరికట్టాలని ఇన్సాఫ్ నాయకులు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్ మాట్లాడుతూ నగరంలో యథేచ్ఛగా సింగిల్ నెంబర్లాట సాగుతోందని, ముఖ్యంగా సంతపేట, ఆజాద్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సింగిల్ నెంబర్లాట సాగిస్తున్నారని పేర్కొన్నారు. సంతపేట పోలీసులకు అన్నీ తెలిసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ముత్యాలపాళెం ప్రాంతానికి చెందిన రాజకృప అనే మహిళ తన పిల్లల కోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహించే ఓ సంస్థకు నగదు చెల్లించింది. వారు ఓటీపీ చెప్పాలని కోరడంతో తెలియజేసింది. అయితే ఆ సంస్థ ఓటీపీ ద్వారా ఓ ఫైనాన్స్ సంస్థకు లింక్ చేశారే తప్ప.. ఆన్‌లైన్ తరగతులు మాత్రం నిర్వహించలేదు. తాను చెల్లించిన నగదును ఇవ్వాలని కోరినా సమాధానం లేదు. దీంతో ఆమె బాలాజీనగర్ పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగి తిరిగి చేసేది లేక నగర డీఎస్పీని ఆశ్రయించింది. ఆయన సూచనల మేరకు దర్గామిట్ట పోలీసుస్టేషన్‌కు వెళ్లినా ప్రయోజనం లేదు. చివరికి ఎస్పీ గ్రీవెన్స్‌కు వెళ్లినా అంతే.





రెవెన్యూ సమస్యలు

వేగంగా పరిష్కరించండి

అధికారులతో వీసీలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 29 : రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యూటేషన్ ట్రాన్సక్షన్లపై తహసీల్దార్లు దృష్టి సారించాలన్నారు. ఎటువంటి కారణాలు లేకుండా దరఖాస్తులను తిరస్కరించవద్దని సూచించారు. గ్రామాల వారీగా ఆయకట్టు వివరాలు సేకరించాలని, ఎంత మేర పొలాలకు నీరు అవసరమో లెక్క తేలిస్తే ఐఏబీ సమావేశంలో నీటి విడుదలకు అవకాశం ఉంటుందన్నారు. పెన్నానది పరివాహక మండలాల్లో కరకట్టల ఆక్రమణలను తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించాలని ఆదేశించారు. ఎస్టీలకు జనన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు ఇప్పించాలని ఆదేశించారు. వచ్చే నెల 1న 99 శాతం మేర పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనిదినాలను బాగా పెంచాలన్నారు. అలాగే పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండాచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఎఫ్‌పీవోలకు లైసెన్సులు మంజూరు చేయండి

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు త్వరితగతిన లైసెన్సులు మంజూరు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన జిల్లాస్థాయి మానిటరింగ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ దళారుల బారిన పడకుండా రైతులే ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగ మందులు తదితరాలతోపాటు పంటలకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

మెప్మా పీడీ, డీఈవోలకు సత్కారం

ఫ్లాగ్ డే సందర్భంగా జిల్లా నుంచి ఎక్కువ మొత్తంలో నిధి సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందచేసిన మెప్మా పీడీ రవీంద్ర, డీఈఓ రామారావును కలెక్టర్ ఆనంద్ అభినందించారు. వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందచేశారు. మెప్మా పీడీ రూ.6.57లక్షలు, డీఈఓ రూ. 3.3 లక్షలు సేకరించి సైనిక సంక్షేమనిధికి అందచేశారని జిల్లా సైనిక సంక్షేమాధికారి రమేష్ తెలిపారు. అలాగే జిల్లాలో సైనిక సంక్షేమ నిధికోసం రూ.18 లక్షలు సేకరించి మూడవ స్థానం సాధించినందుకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నామని తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించండి

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నిరుద్యోగులు, విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వివిధ రంగాల్లో తరచూ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగావకాశాలను గుర్తించాలన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను గుర్తించి గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఉదయగిరి చెక్క వృత్తి కళాకారులు తయారు చేసిన స్పూన్, ఫోర్క్‌లను కలెక్టర్‌కు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి అందచేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి వెంకటయ్య, ఏపీఎంఐపీ పీడీ రవీంద్ర, వివిధ కళాశాలల స్కిల్ డెవలప్‌మెంటు విభాగ అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో సరుకు రవాణా, తీరప్రాంతంలో పారిశ్రామిక ప్రగతి, వరదల నుంచి తీరప్రాంతవాసులకు రక్షణ... ఇలా బహుళ ప్రయోజనాలు కలిగిన బకింగ్‌హామ్(బీకే) కెనాల్ సమగ్రాభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. ప్రస్తుతం ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండడంతో కేంద్రం నిధులతో చేపట్టే ఈ కెనాల్ అభివృద్ధి ఫైల్‌ను రాష్ట్ర పాలకులు కదిలిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. కెనాల్ అభివృద్ధికి సర్వే చేపట్టి ఇప్పటికి ఎనిమిదేళ్లు పూర్తయినా, సర్వే నివేదిక తుదిరూపం దాల్చలేదు. సర్వే అనంతరం కెనాల్ అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేస్తే కానీ భూసేకరణ ఎంత అవసరమో తేలదు. ఈ కెనాల్ నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాల్సి ఉన్నందున జిల్లా నాయకులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బకింగ్‌హామ్

బాగుపడేనా!?

- ఎనిమిదేళ్లుగా సాగుతున్న సర్వే ● నిర్ధారించని అలైన్‌మెంట్
- అలైన్‌మెంట్ అయితేనే భూసేకరణ
- తీరప్రాంత వాసులకు రక్షణగా కాలువ



పూడికతో నిండిన బకింగ్‌హామ్ కాలువ

కావలి, జూలై 29: బకింగ్ హామ్ కాలువ ప్రకాశం జిల్లా చినగంజాం నుంచి తిరుపతి జిల్లా తడ వరకు 258 కి.మీ పొడవున ఉంది. ప్రకాశం జిల్లాలో 80, నెల్లూరు జిల్లాలో 178 కి.మీ పొడవున ఉంది. సముద్రానికి సమాంతరంగా ఒకచోట దగ్గరగా, మరోచోట దూరంగా వెళుతున్న ఈ కెనాల్ నిర్వహణలేక పోవటంతో అనేకచోట్ల ఆక్రమణకు గురైంది. ఫలితంగా కుంచించుకుపోయింది. అంతేకాక పూడికతో నిండిపోయి ఉంది. దీని సబ్‌డివిజన్ కార్యాలయం ఇందుకూరుపేట మండలం మైపాడులో ఉంది. చిప్పలేరు, పెన్నా, కండలేరు, తంబలేరు, స్వర్ణముఖి, పులికాట్ నదుల మీదుగా బకింగ్‌కెనాల్ సాగుతోంది. రామాయపట్నం వద్ద కెనాల్‌పై రోడ్డు, రైల్వేవంతెనలు నిర్మించాల్సి ఉండగా, పనులు జరుగుతున్నాయి. రైల్వే వంతెన నిర్మాణానికి కేంద్రం అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.



కుంచించుకుపోయిన కాలువ

● అలైన్‌మెంట్ ఫైనల్ అయితేనే కదలికలు

కెనాల్ సర్వే తుది రిపోర్టు అందిన తర్వాత అలైన్‌మెంట్ ఫైనల్ అయితే కాలువకు ఇరువైపులా ఎంత స్థలం అవసరమో తేలుతోంది. అప్పుడు దాని ప్రకారం సర్వే చేస్తే ప్రభుత్వ స్థలాలు ఎంత ఉన్నాయి...? వాటిలో ఆక్రమణలు ఏమేరకు ఉన్నాయి...? పట్టా భూములు ఎంత ఉన్నాయి తేలుతుంది. పట్టా భూములను రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి ఇస్తే కేంద్రం ఆ ప్రాజెక్ట్‌కు నిధులు మంజూరు చేస్తుంది. ఇదంతా జరగాలంటే డబుల్ ఇంజన్ పాలనలో రాష్ట్రం చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

● బహుళ ప్రయోజనాలు

బీకే కెనాల్ నిర్మాణం చేపడితే సరుకుల రవాణా ఖర్చులు బాగా తగ్గుతాయి. పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాలువ ఎడమ గట్టుపై రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున అక్కడ నుంచి జాతీయరహదారి వరకు పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. పారిశ్రామిక అభివృద్ధి జరిగితే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయి. తీరప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకు పోతుంది. తీరం వెంబడి ఎక్కువగా వ్యవసాయానికి పనికి రాని భూములు ఉన్నందున అక్కడ పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుంది. తుఫాన్‌లు తదితర విపత్కర సమయంలో సముద్రం ఉప్పొంగి సమీపంలో ఉన్న గ్రామాల్లోకి నీరు రాకుండా కెనాల్ రక్షణగా నిలుస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న బీకే కెనాల్ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

బీవీనగర్ కేఎన్‌ఆర్ పాఠశాలలో నూతన భవన సన్‌షేడ్ కూలి విద్యార్థి గురు మహేంద్ర(14) మృతి చెందిన ఘటనకు సంబంధించిన విచారణ సక్రమంగా సాగేనా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన విచారణను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో ఘటన జరిగితే ఇన్‌చార్జి ఎవరయితే ఉంటారో వారి నుంచే ప్రధానంగా విచారణ ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే ఈ ఘటనలో మాత్రం పాఠశాల పెద్దను తప్పించేందుకు అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు కూడా పావులు కదపడం చర్చనీయాంశంగా మారింది.

'కేఎన్‌ఆర్'ఘటనపై విచారణ సక్రమంగా సాగేనా!?

- విద్యార్థి మృతితో పాఠశాల నిర్వహణపై ఎన్నో అనుమానాలు
- ఓ ఉన్నతాధికారితీరుపై విమర్శల వెల్లువ
- ఆయన తీరునూ తప్పుపట్టిన ప్రత్యేక కమిటీ

నెల్లూరు (విద్య), జూలై 29 : నాడు-నేడు పనులన్నీ నాసిరకంగా జరగాయని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారంటూ విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు భగ్గు మన్నారు. దీంతో కేఎస్ఆర్ పాఠశాలలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ప్రత్యేక కమిటీని నియమించారు. నెల్లూరు డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి, డైట్ కళాశాల లెక్చరర్ వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్ నేతృత్వం లో త్రీమెన్ కమిటీ ప్రాథమిక విచారణ చేపట్టి నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

● నివేదికలో ఏం ఉందంటే..

కేఎస్ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సం ఖ్య అధికంగా ఉండటంతో సమీపంలోని కేఎస్ఆర్ ప్రాథమిక పాఠశాలలో 6 నుంచి 9వతరగతి వరకు మొత్తం 429 మందికి 8 సెక్షన్‌లకు ఐదు గదుల్లో తరగతులు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపస్‌లో ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులతోపాటు ఒక డ్రా యింగ్ టీచర్, అటెండర్లను కేటాయించారు. కేవలం రెండు, మూడు సబ్జెక్ట్‌లలో మాత్రమే బోధన చేస్తూ నామమాత్రంగా నే తరగతులు నిర్వహిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. సం ఘటన జరిగిన రోజున మాత్రం ఇద్దరు సాధారణ సెలవులో ఉండగా కేవలం ఒక ఉపాధ్యాయుడు, అటెండర్ మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిసింది. హెచ్ఎం మొబైల్ స్విచ్చాఫ్ రావ డంతో విద్యార్థి తల్లిదండ్రులకు, 108కు సమాచారం అందించా రు. 108 సిబ్బంది పరిశీలించి అప్పటికే గురుమహేంద్ర మృతి చెందినట్లు నిర్ధారించినట్లు విచారణలో తెలిపారు.



ఈ నెల 26వ తేదీన విద్యార్థి మృతి ఘటనపై వాదులాడుకుంటున్న డీఈవో, హెచ్ఎం (ఫైల్)

● 1562 మందికి 20 మంది టీచర్లు

కేఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో 1562 మంది విద్యార్థులు ఉండగా తరగతి గదులు, బోధనా సిబ్బంది లేకపోవడంతో 18 సెక్షన్లు విద్యార్థులను విభజించారు. 19 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు ఒక డీపీ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 6 లేదా 7 పీరియడ్‌లను బోధిస్తున్నా అన్ని తరగతులకు సరైన బోధన అందించలేక పోతున్నట్లు గుర్తించామని కమిటీ తన నివేదికలో పేర్కొంది. దీంతో హెచ్ఎం తన సొంత నిర్ణయంతో 6 నుంచి 9వ తరగతి వరకు 429 మంది విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలలో తరగతులు ఏర్పాటు చేశారు. కొన్ని సబ్జెక్ట్‌లకు మాత్రమే బోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు అందరికీ విద్య అనే నినాదం ఈ పాఠశాలలో అమలు కావడం లేదన్నది గుర్తించామన్నారు. మొత్తమ్మీద పాఠశాలలో జరుగుతున్న వ్యవహారంపై మరింత లోతైన విచారణ జరగాల్సి ఉందని తెలియచేస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు అందచేసినట్లు తెలిసింది.

● చర్యలు చేపట్టేనా...

ఏం చేసినా, అధికారులతో దురుసుగా ప్రవర్తించినా కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ పాఠశాల ఉన్నతాధికారికి అండగా ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా రాష్ట్రస్థాయి విద్యాశాఖలో ఉన్న ఓ ఉన్నతాధికారి తమ సామాజిక వర్గమైన సదరు అధికారికి అండదండలు అందిస్తున్నారన్న విమర్శలున్నాయి. గతంలో కూడా విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల వేధింపుల ఘటన వెలుగులోకి రావడంతో ఆ ఉన్నతాధికారి జోక్యం చేసుకుని అధికారిని పక్కకు తప్పించి మరొకరిని బలిచేశారన్న వాదనలు ఉన్నాయి. తాజాగా ఓ విద్యార్థి మృతి చెందడంతో తిరిగి తన మద్దతుదారులైన అధికారులు రంగంలోకి దిగి ఆయన్ను తప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

వృద్ధులు, దివ్యాంగుల సమస్యలకు

ప్రాధాన్యమివ్వండి: కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 223 అర్జీలు



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 29 : వృద్ధులు, దివ్యాంగుల సమస్యలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యపై అర్జీలు సమర్పించారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమానికి 223 అర్జీలు అందాయని, అందులో రెవెన్యూ సమస్యలపై అత్యధికంగా 124, మున్సిపల్ శాఖకు 18, పంచాయతీ శాఖకు 15, పోలీసు శాఖకు 13 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

● సోమశిల, కండలేరు డ్యాములకు శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెన్నా జలాలపై ఆధారపడి సోమశిల జలాశయం, సోమశిల మిగులు జలాలపై ఆధారపడి కండలేరు నిర్మించారన్నారు. ప్రస్తుతం పెన్నా జలాలు సక్రమంగా రానందున పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా జలాలను సోమశిల, కండలేరు జలాశయాలకు విడుదల చేసి సాగునీటి కేటాయింపులు చేయాలని కోరారు.

● మహ్మద్‌లకు బీసీ-ఈ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ ఆవాజ్ కమిటీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల్లో మహ్మద్ అని ఉంటే ఓసీ అని రాస్తున్నారన్నారు. దీనివలన మైనార్టీ విద్యార్థులు రిజర్వేషన్లు కోల్పోతారని, అందువలన మహ్మద్‌లకు బీసీ-ఈ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రషీద్, సభ్యులు షేక్ నజీర్‌బాషా, అహ్మద్, ఇషాక్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిని సోమశిలకు తరలించండి

నెల్లూరు(వైద్యం) : సోమశిల ప్రాజెక్టుకు శ్రీశైలం వరద నీటిని తరలించాలని కోరుతూ కలెక్టర్ ఆనంద్‌కు కాంగ్రెస్ పార్టీ నేత సంజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా వరదనీరు శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చిందన్నారు. ఈ నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిల ప్రాజెక్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అడ్వకేట్ చాగం సుస్మితరెడ్డి. చక్రధర్, సుధీర్, రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులాల పేరిట విధ్వంసాలకు వైసీపీ కుట్ర

- కూటమి నేతలు సంయమనం పాటించాలి
- జగన్ మానసికస్థితిపై అనుమానం కలుగుతోంది
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద

నెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కులాల పేరిట విద్వేషాలు రెచ్చగొట్టి విధ్వంసాలు చేసేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆరోపించారు. సోమవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజల్లో చర్చ జరగకుండా చేసేందుకు వైసీపీ నేతలు చౌకబారు విమర్శలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ నాయకుల అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కుల ప్రస్తావనలు తీసుకొస్తున్నారని విమర్శించారు. 2019లో కూడా ఇదే మాదిరిగా ఒక కులానికి టీడీపీ ప్రభుత్వం కొమ్ము కాస్తోందంటూ తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. ఇటీవల ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు తిరస్కరించినా బుద్ధిరాలేదని మండిపడ్డారు. 'ఏబీఎన్ రాధాకృష్ణకు పాదాభివందనం, ఈనాడు రామోజీరావుకు సాష్టాంగ నమస్కారం చేసినప్పుడు జగన్మోహన్‌రెడ్డి కులం గుర్తుకురాలేదా..? నవయుగ సీవీ రావుతో కలిసి వ్యాపారాలు చేసినప్పుడు జగన్‌కు కులం గుర్తుకురాలేదా..?' అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ కులాలను చూడలేదని, అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని చెప్పారు. ఎన్డీయే కూటమి నేతలంతా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. రాక్షస పాలన, శాంతిభద్రతలు, వ్యవస్థల విఫలం గురించి ఢిల్లీలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడడం ఆశ్చర్యాన్ని కలిగించిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల విధ్వంసం చేశారనే కదా ప్రజలు తిరస్కరించారన్న విషయాన్ని జగన్‌రెడ్డి గుర్తించలేకపోతున్నారని, ఆయన మానసికస్థితిపై అనుమానం కలుగుతోందని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, రూప్‌కుమార్ యాదవ్, పనబాక భూలక్ష్మి, సాబీర్‌ఖాన్, తిరుమలనాయుడు, అమ్ముల్లా, వల్లెపు మునుస్వామి, మాతంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

ఉపాధ్యాయినుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీ మహిళా టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఉమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ఉమాదేవి

నెల్లూరు(విద్య), జూలై 29 : పాఠశాలల్లో ఉపాధ్యాయినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ మహిళా టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు గొల్ల ఉమాదేవి తెలిపారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మహిళా టీచర్లతో 2012లో అసోసియేషన్ ఏర్పాటైందన్నారు. అన్ని జిల్లాల నుంచి ప్రాతినిధ్యం ఉండేలా రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశామని, సభ్యులంతా సమష్టిగా అసోసియేషన్ ఉన్నతికి పాటుపడాలని తెలిపారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వితపు రాధారాణి, గౌరవాధ్యక్షురాలు సంగోజు రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు చిన్ని అనూరాధ, గౌరవ సలహాదారురాలు టీవీ.సుధారాణిని ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులంతా కలిసి తమ సమస్యలను తెలియచేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను కలిసి వినతిపత్రం అందచేసేందుకు విజయవాడ వెళుతున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకురాలు సరస్వతి పద్మజ తెలిపారు.



ఉలవపల్లి గ్రామసభలో వాదించుకుంటున్న ఇరువర్గాలు

గ్రామసభలో ఇరువర్గాల ఘర్షణ

చేజర్ల, జూలై 29: తిమ్మాయిపాళెం పంచాయతీ పరిధిలోని ఉలవపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ప్రత్యేక గ్రామసభలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొన్నిరోజులుగా జరిగిన పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయంటూ గ్రామంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వివాదాలు జరుగుతున్నాయి. గత నెలలో కూడా జరిగిన గ్రామసభలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. గ్రామంలో జరిగిన అవకతవకలు గురించి జిల్లా అధికారులు విచారించి సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై కూడా సస్పెన్షన్ విధించారు. అయినా గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం కూడా ఇరువర్గాల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఈ సంఘటనతో గ్రామసభలో ఎలాంటి తీర్మానాలు చేయకుండా అర్థంతరంగా ముగించి అధికారులు అక్కడ నుంచి వెనుతిరిగారు.

గంజాయి మత్తులో యువకుడు

మహిళపై అఘాయిత్యానికి యత్నం

- తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 29 : ఓ ఒంటరి మహిళపై గంజాయి మత్తులో ఓ యువకుడు అఘాయిత్యానికి పాల్పడి, దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత మహిళ, పోలీసుల వివరాల మేరకు రాఘవరెడ్డి కాలనీకి చెందిన ఓ మహిళ తన ఇంటి పని చేయిస్తుండగా కల్యాణ్ అనే యువకుడు అక్కడున్న కూలీలతోపాటు మహిళను అసభ్యపదజాలంతో దుర్భాషలాడాడు. అందరితో ఘర్షణకు దిగుతూ అక్కడే ఉన్న గడ్డపార తీసుకుని దాడి చేయపోగా భయంతో బాధిత మహిళ రోడ్డుపైకి చేరుకుని కల్యాణ్ బంధువులకు చెప్పేందుకు ఓ ఆటోలో బయలుదేరింది. ఆ యువకుడు కూడా వెంబడించి ఆటోలో ఎక్కి కనిసిరిపాళెం వద్ద డ్రైవర్‌ను బెదిరించి ఆటోలో నుంచి మహిళను దించి కట్టెలదొడ్డి సమీపంలో ఓ ఇంట్లోకి లాక్కెళ్ళాడు. తనపై అఘాయిత్యానికి పాల్పడుతుండటంతో అక్కడ నుంచి తప్పించుకుని పరుగులు తీసింది. ఈమెను గమనించిన కల్యాణ్ తల్లి బాధిత మహిళకు ఆసుపత్రిలో చికిత్స చేయించి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆమె వేడుకుంటోంది. బుచ్చిలో గంజాయి, తదితర డ్రగ్స్ మత్తులో యువకులు ఎప్పుడు ఏం చేస్తారో అర్థంకాక మహిళలు బెంబేలెత్తుతున్నారు. జిల్లా పోలీసు అధికారులు బుచ్చి నగర పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

పైపులైన్ వాల్వ్‌కు మరమ్మతులు

బిట్రగుంట, జూలై 29: బోగోలు పంచాయతీ పరిధిలోని చెంచులక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మంచినీటి పైపులైను వాల్వ్ లీకేజీపై ఈనెల 25న ఆంధ్రజ్యోతిలో 'ఈ నీరు తాగేదెలా' అనే శీర్షికతో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు సోమవారం స్పందించారు. వాల్వ్ గుంటను శుభ్రంచేసి, మరమ్మతుకు గురైన వాల్వ్‌ను మార్చారు. దీంతో ప్రజలకు యథావిధిగా మంచినీరు అందింది. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



వాల్వ్‌కు మరమ్మతు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కండాపురం సమీపంలో క్షుద్ర పూజలు

చేజర్ల, జూలై 29: కండాపురం సమీపంలోని వాగులో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. సోమవారం పశువుల కాపరులు వాగు వైపు వెళుతుండగా ముగ్గు వేసి, నిమ్మకాయలు పెట్టి పూజలు చేసి ఉండటాన్ని గమనించి గ్రామస్థులకు తెలిపారు. ఇలాంటి సంఘటనతో రాత్రుళ్లు బయట తిరగాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

సోమశిల గ్రామంలో రెండు చోట్ల చోరీ

అనంతసాగరం, జూలై 29: సోమశిలలోని రెండుప్రాంతాల్లో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి తెగపడ్డారు. వివరాల మేరకు.. స్థానిక చర్చి రేకులు పగుల గొట్టి ప్రార్థనా మందిరంలోకి చొరబడి బీరువా తాళాలు పగుల గొట్టారు. అందులో విలువైన వస్తువులు, నగదు దొరక్క పోవడంతో సమీపంలోని చేపల అమ్మే అంగట్లో ఇదే తరహా చోరీకి పాల్పడ్డారు. అక్కడ రూ.25 వేలు చోరీకి గురైనట్లు బాధితుడు పెంచలయ్య తెలిపాడు. చోరీ విషయమై పెంచలయ్యతోపాటు చర్చి పాస్టర్ నవీన్ కూడా సోమశిల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకే రోజు రెండు చోట్ల దుండగలు చొరబడడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల ఢీ : ముగ్గురికి గాయాలు

కావలి రూరల్, జూలై 29: కావలి మండలం గౌరవరం సమీపంలో సోమవారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు, గౌరవరం గ్రామానికి చెందిన గుడిపల్లి తిరుపతి తన మోటారు సైకిల్‌పై దేవరపల్లి రమణయ్యను ఎక్కించుకుని గ్రామం నుంచి హైవే మీదుగా పొలాలకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బిట్రగుంట నుంచి కావలికి మోటారు సైకిల్‌పై వస్తున్న వాసు వారిని వెనుక వైపు నుంచి ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో దేవరపల్లి రమణయ్య తలకు తీవ్రగాయం కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

డీటీసీ కార్యాలయంలో ఏజెన్సీకి దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 29: జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ గార్డ్, హౌస్ కీపింగ్ సర్వీసెస్ ఏజెన్సీ కోసం ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీటీసీ చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీకి పాత ఏజెన్సీ గడువు ముగిస్తుందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు

నిందితుడికి ఐదేళ్ల జైలు

ఉదయగిరి రూరల్, జూలై 29: భార్య, అత్తలపై దాడి చేసిన కేసులో నిందితుడు బూరగ వెంకటేశ్వర్లుకు ఐదేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా జడ్జి జీ గీత సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెట్టివారిపల్లి గ్రామానికి చెందిన బూరగ వెంకటేశ్వర్లకు చౌడేపల్లి అరుణతో వివాహమైంది. కొంతకాలం వీరి సంసారం సజావుగా సాగినా అనంతరం మనస్పర్థలు వచ్చాయి. అరుణ పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో అక్టోబరు 30, 2017న వెంకటేశ్వర్లు, తన బంధువైన హరికృష్ణతో కలిసి చౌడేపల్లికి వెళ్లి భార్య అరుణ, అత్త రాముల రత్తమ్మతో వివాదానికి దిగాడు. ఈ సమయంలో మాటమాట పెరగడంతో మంచంకోడి తీసుకొని అత్త తలపై కొట్టడంతో ఆమె తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువడింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6529
వెండి కిలో ధర	రూ. 84,100
వెండి ఒక గ్రాము	రూ. 86.10

తల్లిని చూసేందుకు వెళ్తూ కొడుకు దుర్మరణం



మహేష్ (ఫైల్)

మనుబోలు, జూలై 29: తల్లికి ఆరోగ్యం బాగోలేదని తెలిసి చూసేందుకు వెళుతున్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండలంలోని పోర్లు క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జట్లకొండూరు దళితవాడకు చెందిన ఏచూరి మహేష్ (30) ప్రభుత్వ శాఖలో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తుండేవాడు. ఇటీవల సస్పెండ్ అయ్యాడు. కాగా, నెల్లూరులోని వీవర్స్ కాలనీలో ఉంటున్న తల్లికి ఆరోగ్యం బాగోలేదని మహేష్‌కు ఫోన్‌ద్వారా సమాచారం అందడంతో స్కూటీపై జట్లకొండూరు నుంచి నెల్లూరుకు బయలుదేరాడు. పోర్లు క్రాస్‌రోడ్డుకు వచ్చేసరికి రోడ్డు డైవర్షన్ కోసం పెట్టిన ఇనుప దిమ్మెను ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, తన భర్త మరణానికి రోడ్డునిర్మాణ నిర్వాహకులే కారణమని, రోడ్డుపై ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడం వల్లే తన భర్త చనిపోయాడని భార్య ఉమామహేశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది.

వీఆర్‌లో ఎస్‌ఐలకు స్టేషన్ల కేటాయింపు

నెల్లూరు(క్రైం), జూలై 29: వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలను పలు పోలీసు స్టేషన్లకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీ వెంకటేశ్వర్లును డీసీఆర్‌బీ నెల్లూరు, ఎస్‌డీ అబ్దుల్ రహీమ్‌ను సీసీఎస్‌కు, వీ తిరుపతయ్యను డీటీసీకి బదిలీ చేశారు. వీసీహెచ్ సుబ్రమణ్యంను చిన్నబజారు పోలీసు స్టేషన్‌కు, కె ఈడ్వార్డ్‌ను కొడవలూరు పోలీసు స్టేషన్‌కు, కె బాలకృష్ణయ్యను కావలి రూరల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎల్ రాములును వీవీ పాలెం, వీ మాల్యాద్రి సౌత్‌ట్రాఫిక్‌కు, వి వెంకటేశ్వర్లును కావలి రెండవ నగర పోలీసు స్టేషన్‌కు, కె వెంకటాద్రి నాయుడును సీసీఎస్ నెల్లూరుకు, టి వెంకటేశ్వర్లును డీఎస్‌బీకి బదిలీ చేశారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్‌కు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), జూలై 29 : రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వివిధ కేటగిరీలలో క్రీడాకారులు ఎంపికయ్యారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ మైదానంలో జరుగుతున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిసాయి. అండర్-11, 13, 15, 17, 19 విభాగాలతోపాటు మెన్, ఉమెన్ కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరగ్గా జిల్లా వ్యాప్తంగా 180 జట్లు తలపడ్డాయి. అండర్-11 బాలుర సింగిల్స్‌లో నాగసాయి భరత్, బాలికలలో యూపీ నిత్య, బాలుర డబుల్స్‌లో నాగసాయిభరత్-యశ్విన్, బాలుర అండర్-13 సింగిల్స్‌లో వర్షిత్, బాలికలలో లతారెడ్డి, బాలుర డబుల్స్‌లో వర్షిత్-మహేందర్‌రెడ్డి, బాలికలలో లత-యూపీ నిత్యలు, బాలుర అండ ర్-15 సింగిల్స్‌లో కార్తిక్, బాలికల్లో జి.సుష్మారెడ్డి, బాలుర డబుల్స్ లో ఎస్‌కె.షాహిల్- ఎన్.రాధాకిషన్, బాలికల్లో దీప్తి-సుదీప్తి, బాలుర అండర్-17 సింగిల్స్‌లో కార్తీక్, బాలికల్లో సుష్మలు, బాలుర డబుల్స్‌లో అనంత్-రేవంత్, బాలికల్లో జాహ్నవి-లక్ష్మీప్రియ విజేతలుగా నిలిచారు. అలాగే బాలుర అండర్-19 సింగి ల్స్‌లో కె.మహేంద్ర, బాలికల్లో జి.సుష్మ, బాలుర డబుల్స్‌లో ఆదిత్య-కుమారశ్రీ విజయం సాధించారు. పురుషుల సింగిల్స్‌లో కె.మహేంద్ర, డబుల్స్‌లో రూపేష్-యశ్వంత్ విజేతలుగా నిలిచారు. ముగింపు కార్య క్రమంలో ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు దూడల సుధాకర్, కోశాధికారి శ్రీకాంత్, సభ్యులు మద్దిపాటి ప్రసాద్‌రావు, రామ్మోహన్‌రావు, తాళ్లపాక వరప్రసాద్, డీఎస్‌ఏ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, కోచ్ వెంకటేష్, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్వార్ట్జ్ అక్రమాలపై విచారణ వేగవంతం

- రంగంలోకి రాష్ట్ర మైన్స్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 29 : జిల్లాలో గత ఐదేళ్లలో జరిగిన క్వార్ట్జ్, సిలికా అక్రమాలపై విచారణ వేగవంతమైంది. ఇప్పటికే అక్రమాలు నిగ్గుతేల్చేందుకు 7 ప్రత్యేక బృందాలను ఎన్‌డీఏ ప్రభుత్వం నియమించింది. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో జిల్లాలో విచారణ ఎలా జరుగుతోందనే దానిపై నేరుగా రాష్ట్ర మైన్స్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ (ఐఏఎస్) రంగంలోకి దిగారు. ఈ మేరకు సోమవారం జిల్లాకు చేరుకున్న ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా గూడురు, సైదాపురం తదితర ప్రాంతాల్లో జరిగిన క్వార్ట్జ్ అక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చిల్లకూరులో సిలికా ఘనులను పరిశీలించారు. విచారణ వేగవంతంగా చేయాలని ప్రత్యేక బృందాలను ఆదేశించారు. త్వరలోనే పూర్తిస్థాయి అక్రమాల నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట జిల్లా మైనింగ్‌శాఖ డీడీ శ్రీనివాసకుమార్, ప్రత్యేక బృందాల అధికారులు, తదితరులు ఉన్నారు.



సంగం : కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను పూడ్చి పెడుతున్న అధికారులు

చికెన్ వేస్టేజ్ వాహనాలపై పోలీసు దాడులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 29: మండలంలోని దామరమడుగు, రేబాల గ్రామాల్లోని చేపల గుంటలకు చికెన్ వేస్టేజ్ తరలించే రెండు వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వాహనాలలోని మొత్తం 17 డ్రమ్ములలోని చికెన్ వేస్టేజ్‌ను శ్రీరంగరాజపురం వద్ద పెన్నానదిలో నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. ఈమేరకు వాహనంతోపాటు డ్రైవర్లపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

చికెన్ వ్యర్థాల తరలింపు వాహనాల అడ్డగింపు

సంగం, జూలై 29: ఎస్‌వీఆర్ పురంలోని చేపల చెరువులకు తరలిస్తున్న చికెన్ వ్యర్థాల వాహనాలను సోమవారం గ్రామస్థులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి డమ్ముల్లో ఉన్న చికెన్ వ్యర్థాలను గుంతలు తీసి పూడ్చి పెట్టారు. ఇళ్ల పక్కనే ఉన్న చెరువులోని చేపలకు గత కొంతకాలం నుంచి కుళ్లిన చికెన్ వ్యర్థాలను మేతగా వేస్తున్నారని చెప్పారు. వీటి దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

అమ్మకము

ఆహ్వానం, సంస్థలకు, స్థిరాస్తి- విలీనం/ అమ్మకము/ అభివృద్ధికి గిడ్డంగి వీధి, చిన్న బజారు -134, చంద్రమౌళినగర్, వేదాయపాళెం-154.
సం.ప్ర.సెల్: 77290 47122
AJR-178092

స్థలము అమ్మబడును

నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కాలేజి సమీపంలో, నేషనల్ హైవే ప్రక్కన 285 అంకణముల స్థలం అమ్మబడును. వివరములకు సంప్రదించవలసిన నెంబర్: 91773 39107
AJR-178341

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మధ్యాహ్న భోజనంలో పండ్లు, స్వీట్లు పంపిణీ



సీతారామపురం: కస్తూర్బా విద్యాలయంలో పిల్లలకు స్వీట్లు అందిస్తున్న సర్పంచి కొడవటికంటి భాగ్యకుమారి



సంగం: ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్, ఉపాధ్యాయులు

● అట్టహాసంగా

శుభదిన్ భోజన్ కార్యక్రమం

సంగం, జూలై 29: కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా సోమవారం (7వ రోజు) శుభదిన్ భోజనం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రతి పాఠశాలలో దాతలతో భోజనంలో విద్యార్థులకు స్పెషల్ ఐటెం (పండ్లు, స్వీట్, ఇతర ఆహార పదార్థాలు) ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సంగం ఉన్నత పాఠశాల, తిరుమనతిప్ప పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో డిప్యూటీ డీఈవో గోపాల్ పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జానికిరామ్, మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా వెంగారెడ్డిపాలెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, అంగన్‌వాడీ కేంద్రంలో స్వీట్, అరటి పండుతో స్పెషల్ భోజనం వడ్డించారు.

సీతారామపురం: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయ విద్యార్థినులకు సోమవారం సీతారామపురం సర్పంచ్ కొడవటి కంటి భాగ్యకుమారి వివిధ రకాల స్వీట్లు, పండ్లు ఫలహారాలు మధ్యాహ్న భోజనంతో పాటు అందజేశారు. ఎంఈఓ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ పౌజియా, ఉపాధ్యాయ సిబ్బంది, కార్యదర్శి జీవన్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, మహిళా పోలీస్ హజీరాబేగం పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ పెంచలకోన ట్రస్టు సభ్యులు, టీడీపీ నాయకులు చల్లా రమణారెడ్డి విద్యార్థులకు లడ్డు పంపిణీ చేశారు. నాయీబ్రాహ్మణ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో మాజీ మండల విద్యాశాఖాధికారి కామిశెట్టి శ్రీనివాసులు విద్యార్థులకు స్వీట్లు, అరటి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు దండు పెంచలయ్య, టీడీపీ నాయకులు నూతేటి నరసింహులు, పిడుగు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి: విద్యార్థులకు మిఠాయిలు అందజేస్తున్న దాతలు

ఉదయగిరి రూరల్: ఎంఈవో-2 తోట శ్రీనివాసులు బిజ్జంపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో దాత జమ్ముల వెంకటేశ్వర్లు అందజేసిన పండ్లు, మిఠాయిలను భోజన సమయంలో పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల ప్రగతి, పలు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఉదయగిరి ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ షేక్ గాజుల జాఫర్‌సాహెబ్ కుమారుడు విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయక్, బాలశేషయ్య, సర్పంచ్ లక్కు రమణమ్మ, పాఠశాల చైర్మన్ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.





వింజమూరు: విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

వింజమూరు: చాకలికొండ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగోటి కృష్ణ, తల్లిదండ్రులు వెలుగోటి కోటిలింగం నాయుడు దర్శనపల్లి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం పండ్లు, స్వీట్లను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పొలుబోయిన రమేష్, విజయకుమారి, ఏ.సుభాషిణి, టి.సురేష్, సీతామహాలక్ష్మి, ఎస్.కె.సమీరా బేగం, జూనియర్ అసిస్టెంట్ సూరా రామిరెడ్డి, గురుశేఖర్ పాల్గొన్నారు.

● సీతారామపురం మండలం అయ్యవారిపల్లి స్కూల్‌లో బీజేపీ నాయకురాలు జ్యోతి, మయూరిలు విద్యార్థులకు అరటిపండ్లు, ఆల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో బి.అయ్యప్ప, బి.సత్యప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషి అభినందనీయం

వింజమూరు, జూలై 29: నియోజకవర్గానికి రెండు డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేయడం అభినందనీయం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి అన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ఈ సమస్యను తీసుకుపోగా సానుకూలంగా స్పందించిన మంత్రికి రూ.40లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన

కలువాయి, జూలై 29: చింతలపాలెంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవో మురళి పరిశీలించారు. వైసీపీ హయాంలో జరిగిన ఉపాధి పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకున్న విషయం విలేఖ చేపట్టిన సామాజిక తనిఖీలో వెలుగుచూసింది. ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. మస్టర్లలో కూలీల హాజరును తనిఖీ చేశారు.

పనులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

కలువాయి, జూలై 29: కుల్లూరు పంచాయతీలో 2020నుంచి ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించడం లేదని పలువురు కూలీలు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మూడురోజులు పనిపెట్టి ఆ తరువాత మళ్లీ నిలిపి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొందరు పనులు చేయని వ్యక్తులు అడ్డుపడుతున్నారని తెలిపారు. కలెక్టర్ చర్యలు తీసుకుని కూలీలకు పని కల్పించాలన్నారు.

పంటలను సంరక్షించండి

ఉదయగిరి రూరల్, జూలై 29: ఆవుల బారి నుంచి తమ పంటలను సంరక్షించాలని సోమవారం బండగానిపల్లి రైతులు కోరారు. సజ్జ, ఇతరత్రా పంటలు సాగు చేశామని సమీపంలోని జి.చెర్లపల్లి ఆవులు పంటలపై పడి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.వేల పెట్టుబడులు పెట్టి సాగు చేశామన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలంటున్నారు.

ఆగస్టు 2న విడుదల



నెల్లూరు - రెయిన్ సినిమాస్
SI నెల్లూరు - సిరి కాంప్లెక్స్
కావలి - మానస
గూడూరు - సుందర్ మహల్ కాంప్లెక్స్
SKML MOTION PICTURES
9849118745/
9299992173

DAMISETTY SRINIVASA NAIDU'S
DBS INSTITUTE OF TECHNOLOGY
(Polytechnic College-678)
An ISO 9001:2008 Certified Institution
NH-5 D.S.Naidu Nagar, Maddurupadu, Kavali SPSR Nellore (D.t)-524201.
Phone No: 08626-211599, 94903 73988, 99499 84685, 94910 26699.
Website: www.dbsinstitutions.com Email ID: dbsinstitutions@gmail.com
1 Year Diploma Spot Admissions: 2024-25
Application are invited from the eligible candidates for the academic year 2024-25 under Spot admission in to 1 Year Diploma

Diploma Branch	CME	ECE	EEE	MEC
Intake	66	59	33	33
Vacant	56	32	27	29
EWS Vacant	6	5	3	3

❖Admission will be made as per the guidelines of SBTET.
❖Application form and other details can be downloaded from our college website www.dbsinstitutions.com or can be obtained from the college office between 10.00 am to 5.00 pm on all working days.
❖Filled in applications along with copies of relevant certificates may be submitted in the office in person between 10.00am to 5.00 pm on all working days or they can apply by online.
POLYCET CODE: DSIT Principal

న్యాయమైన నష్టపరిహారం అందించాలి

సీతారామపురం, జూలై 29: మండలంలో అరు, నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంలో భూములు, ఇళ్లు, స్థిరాస్తులు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారాన్ని అందించాలని రైతు న్యాయ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామాలకు చెందిన రైతులు, రైతు కూలీలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత గిజన ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎలిషా కుమార్ మాట్లాడారు. సర్వేల అంచనాలు వేయకుండా రెవెన్యూ సిబ్బంది తూతూ మంత్రంగా సర్వే చేపట్టడం వలన పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందడం లేదన్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది తప్పిదాలతో ఈ సమస్య తలెత్తిందన్నారు. ప్రతి సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌ను కలిసి అర్జీలు ఇస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. బాధితులకు న్యాయం జరుగకుంటే అన్ని గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ ఆర్డీఓ ఆధ్వర్యంలో స్థానికంగా సిబ్బందితో రీ సర్వే చేయించి ఖచ్చితమైన నష్టపరిహారం చెల్లించాలని హెచ్చరించారు.



సీతారామపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధిత రైతులు

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 29: బ్రహ్మేశ్వరం, దుత్తలూరు, రెడ్డిపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకుని కన్వేన్షన్లు సాగు చేసుకుంటున్నారని, వాటిని కాపాడాలని టీడీపీ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆక్రమణలో సాగు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బ్రహ్మేశ్వరం సమీపంలోని గుర్రాలచక్క భూముల్లో కొంతమంది పట్టాలు పొంది ఉన్నారని, వాటిపై పూర్తి విచారణ చేపట్టాలన్నారు.

ఎక్స్‌కవేటర్ స్వాధీనం: రెడ్డిపల్లి, దుత్తలూరు ప్రభుత్వ భూముల్లో ఆక్రమంగా చెట్లు తొలగించి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను తహసీల్దారు యశోద ఆదేశాల మేరకు వీఆర్వో శ్రీను, వీఆర్‌ఏ మురళిలు యంత్రాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తరలించారు. ఆక్రమణలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తహసీల్దారు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అడ్డుకట్టను తొలగించాలని రైతుల ఫిర్యాదు

సంగం, జూలై 29: తలుపూరుపాడులోని చవిటి వాగు భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తూ పొలానికి ముంపు రాకుండా ఉండేందుకు అడివారం వాగునకు అడ్డుకట్ట వేస్తున్నాడని ఈ పనులను వెంటనే అడ్డుకోవాలని సమీప పొలాల రైతులు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాగు సమీపంలోని తమ పొలాల్లోకి వర్షపు నీరు వెళ్లే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చవిటి వాగు బాట పోరంబోకు భూమి సర్వే నెంబరు 85, 86లో 3.96సెంట్లు, 3.75 సెంట్ల భూమిని కొంతకాలం క్రితం ఆక్రమించి తన ఆధీనంలో ఉంచుకున్నాడని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఉదయగిరి రూరల్, జూలై 29: పట్టణంలోని పూసలకాలనీలో సోమవారం గండిపాళెం ప్రాథమిక కేంద్రం ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరం అన్నారు. దోమకాటుతో డెంగ్యూ చికున్‌గున్యా మలేరియా జ్వరాలు వస్తాయని, వాటి నివారణకు దోమతెరలు వాడాలన్నారు. ఏ విష జ్వర రుగ్మతకు గురైనా వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలన్నారు. అనంతరం కాలనీలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లడంతో పాటు దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాషు, టీబీ సూపర్‌వైజర్ బొగ్గుం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, ఎంఎల్‌హెచ్‌పీ రామారావు, ఏఎన్ఎం నూర్జహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

‘గ్రీవెన్స్’కు అధికారుల డుమ్మా

ఉదయగిరి రూరల్, జూలై 29: ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 18 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం 10.45 గంటలకు కేవలం 6 శాఖల అధికారులు మాత్రమే వచ్చారు. కొంతమంది అధికారులు ఆలస్యంగా వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లారు. అధికారులే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ప్రజా సమస్యలు ఏ శాఖకు పరిష్కరిస్తారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైభవంగా గంగపేట్ట గ్రామోత్సవం

సంగం, జూలై 29: స్థానిక నిమ్మతోటలో వెలసిన అభయ గంగమ్మతల్లి జాతరను పురస్కరించుకుని సోమవారం భక్తులు గంగ పెట్టె గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ గంగమ్మతల్లిని పూలతో అలంకరించారు. అనంతరం పెన్నానది నుంచి గంగ పెట్టెకు పూజలు చేసి వూరంత ఊరేగించారు. పుట్టింటి ఆలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డికి సన్మానం

ఆత్మకూరు, జూలై 29: జీవిత స్వర్ణకుసుమ, కిరీటధారణతో గౌరవం పొందిన తెలుగు భారతి సేవాసమితి ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డిని సోమవారం పట్టణంలోని మేధా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సమితి సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సాంఘిక ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, సేవాసంస్థ అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, గోదావర్తి దుర్గయ్య, సహదేవుల గోవిందరెడ్డి, సహృదయులు కొల్లా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కావలిటౌన్, జూలై 29: పట్టణంలోని ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా టీడీపీ నాయకుల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం పిల్లలకు భోజనాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ డీఈవో రఘురామయ్య, ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి, టీడీపీ నేతలు బిట్రగుంట వెంకట్రావు, లింగం మాల్యాద్రి, కస్తూరి శ్రీధర్, సీతారామయ్య, ప్రభాకర్, కరీంబాషా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జలదంకి : శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం మండలంలోని అన్నవరం ఎంపీయూపీ పాఠశాలలో భోజన కార్యక్రమం జరిగింది. గ్రామ టీడీపీ నాయకుడు పూనూరు రామకృష్ణారెడ్డి దాతగా వ్యవహరించగా, ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ సభ్యుడు కోర్పపాటి మాదవరెడ్డి పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డిని హెచ్ఎం మాధవి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, సుమతి, సుప్రియ, రాము, వెంకటరమణయ్య, టీడీపీ నాయకులు కాటంరెడ్డి మాల్యాద్రిరెడ్డి, షేక్ రసూల్ పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు పాఠశాలల్లో శిక్షాసప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు శుభదిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండబిట్రగుంట పాఠశాలలో హెచ్ఎం మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-1,2 నరసింహారావు, జయమ్మ పాల్గొన్నారు. విద్యార్థులకు భోజనంతోపాటు మిఠాయిలను పంపిణీ చేశారు. ఉమామహేశ్వరపురం పాఠశాలలో పండ్లు, స్వీట్లను స్థానిక టీడీపీ నాయకులు గట్టాల సుబ్బయ్య పంపిణీ చేశారు.

పాఠశాలల్లో శుభ దిన్ భోజన్

లింగసముద్రం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వారం నుంచి జరుగుతున్న శిక్షాసప్తాహ్ ముగింపు సందర్భంగా సోమవారం పలువురు దాతలు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించారు. లింగసముద్రంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, పెంట్రాల యూపీ పాఠశాలలో మాజీ సర్పంచు కిలారి కొండయ్య భోజనం అందించారు.ఈ సందర్భంగా అధికారులు, దాతలు విద్యార్థులకు భోజనం వడ్డించారు. పాఠశాలలను తహసీల్దార్ టీ ప్రసాద్, ఎంపీడీవో కే శ్రీనివాసులు, ఎంఈవో-2 శివకుమార్, ఏపీవో షేక్ సమీర్‌బాషాలు సందర్శించి భోజనం చేశారు.అనంతరం దాతలను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, అంగులూరి చినకొండయ్య, మాజీ ఎంపీపీ బాలకోటయ్య పీ గురునాథం, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, గోగుల మోహన్‌రావు, దార్ల మధు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలోని పొట్టిపల్లి పాఠశాలలో సోమవారం టీడీపీ నాయకులు విద్యార్థులకు భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటుపల్లి మాలకొండయ్య, జి.వెంకటేశ్వర్లు, గడ్డి మాదవరావు, ఉపాధ్యాయులు గొట్టిపాటి మహేష్‌బాబు, కే.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గొట్లగుండాల జడ్పీ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జున, సర్పంచ్ డబ్బుగొట్టు కొండలరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కావలి టౌన్ : మొక్కలు నాటుతున్న టీడీపీ నేతలు



బిట్రగుంట: విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎంఈవో జయమ్మ

పింఛన్ల పంపిణీపై నేడు సమీక్ష

అల్లూరు, జూలై 29 : పింఛన్ల పంపిణీపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమీక్షకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రూరల్, అర్బన్ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇస్కపల్లి-1, అల్లూరు-2 సచివాలయ సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

సీటీ కాలిపోవడం వల్లే విద్యుత్ అంతరాయం

బిట్రగుంట, జూలై 29: సబ్‌స్టేషన్‌లోని బోగోలు 11కేవీ ఫీడర్ కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ (సీటీ) కాలిపోవడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, త్వరలో కొత్త సీటీ ఏర్పాటు చేస్తామని ఏఈ షేక్‌నాగుర్‌వల్లి తెలిపారు. బోగోలు మండలం వెంకట్రామకృష్ణాపురంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీటీ కాలిపోవడంతోపాటు ఈదురు గాలులు వీస్తుండటం కారణంగా ఫీడర్ ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మంగళవారం సీటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కావున ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

జాతీయ టార్గెట్‌బాల్ పోటీలకు మల్లీశ్వరి

కావలిటౌన్, జూలై29: కడప జిల్లా వేంపల్లిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన డీబీఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని కొండూరి మల్లీశ్వరి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావు, అధ్యాపకులు పీడీ సాగర్, ఏఓ రమేష్‌బాబు తదితరులు మల్లీశ్వరిని శాలువాతో సత్కరించి అభినందించారు.

దోమల నివారణకు ఫాగింగ్

కావలి,జూలై29: పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఫాగింగ్ చేయిస్తున్నారు. సోమవారం పట్టణంలోని 39వ వార్డులో ఫాగింగ్ చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నిత్యం ఫాగింగ్ చేస్తూ దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. పట్టణంలో ఇప్పటికే డ్రైనేజీలలో పూడికతీత ప్రారంభించిన అధికారులు, మరో పక్క దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు.

కందుకూరులో చోరీలను అరికట్టాలి

కందుకూరు : పట్టణంలో ఇటీవల దొంగతనాలు విపరీతంగా పెరిగాయని, చోరీల నివారణకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రోపెసర్స్ పోరం అధ్యక్షుడు సేతి మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని ఓవీ రోడ్డులో ఉన్న తమ కార్యాలయంలో ఇటీవల బోరుకు ఉన్న మోటారు, కొంత ఇనుప సామాగ్రిని దొంగలు అపహరించుకుపోయారని, చుట్టుపక్కల అనేక ఇళ్లలో కూడా చోరీలు జరిగాయని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు తగినచర్యలు తీసుకుని చోరీలను నిర్మూలించాలని ఆయన కోరారు.

ప్రజా ఫిర్యాదుల వేదికకు ఏడు అర్జీలు

కందుకూరు : మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో వివిధ సమస్యలపై 7 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కే.వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయా సమస్యల శాఖల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి సమస్యలపై 9177700267 నెంబరుకు ఫోన్‌చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

‘ప్రకాశం’లో రక్తదాన శిబిరం

కందుకూరు : స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కందుకూరు, కావలి ఏరియా వైద్యశాలల రక్తనిధుల కోసం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమం తమ కళాశాలలో సామాజిక ఉద్యమంగా కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టరు ఎండీ షాఫుద్దీన్, డాక్టరు వెంకటరెడ్డి, డాక్టరు విజయశ్రీ, ప్రిన్సిపాల్ రవికుమార్, కళాశాల ఇన్‌చార్జి జీ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారు లబ్ధిదారుల ఇబ్బందులు తొలగించాలి

కలిగిరి : సాంఘికసంక్షేమ శాఖామంత్రి బాలవీరాంజనేయస్వామిని సోమవారం ఉదయగిరి నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకుడు స్వర్ణ కొండయ్య మంత్రి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో కలిశారు. ఈ సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వంలో రాయితీపై ఎస్సీ, ఎస్ఎస్‌ఎఫ్‌డీఎస్ కార్లు పొందిన లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరు సుధీర్‌బాబు, జీ రామాంజనేయులు, జీ రమేష్, ఎన్ రమేష్, రవి, లక్ష్మణ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీలోకి చినలాటిరిపి గ్రామ సర్పంచి

కందుకూరు, జూలై 29: గుడ్లూరు మండలం చినలాటిరిపి గ్రామ సర్పంచి మొగిలి శివపార్వతి సోమవారం టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో ఆమె పార్టీలో చేరగా, ఆయన పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతో పాటు భర్త మొగిలి లక్ష్మీనారాయణ, ఉప్పలపల్లి యలమందారెడ్డి తదితరులు కూడా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శివపార్వతి మాట్లాడుతూ టీడీపీ అంటేనే అభివృద్ధికి చిరునామా అని, సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికోసం కష్టపడుతుండటం, వేలంపుటలు ఆన్నారం ఇవ్వకుండా పాటుపడుతున్న తీరు చూసి పలువురు టీడీపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్టేల యానాదయ్య, మువ్వా మల్లికార్జున, శౌలేషాబు, చిట్టేల వెంకటకృష్ణ, మూలే వెంకటేశ్వర్లు, ఎల్లంకి సుబ్బరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన చినలాటిరిపి సర్పంచి శివపార్వతి తదితరులు

అత్యాచార నిందితుడికి శిక్ష పడేలా చూస్తా : ఎమ్మెల్యే కావ్య

కావలి, జూలై 29: పట్టణంలోని వెంగళరావునగర్‌లో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి చట్టప్రకారం శిక్షపడేలా చూస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. డీఎస్పీ ఎం. వెంకటరమణ, రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కావ్య బాలిక నివాసానికి వెళ్లి వారి తల్లిదండ్రులను పరామర్శించారు. బాలికకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామని, కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. అక్కడకు వెళ్లిన పాత్రికేయులు కొందరు ఫొటోలు తీస్తుండగా, బాలిక ఇంటి పరిసరాల ఫొటోలు తీయకూడదని నివారించారు.

● అత్యాచార ఘటనపై ఖండన

బాలికపై అత్యాచార ఘటనను దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు ఖండించారు. సోమవారం బాలిక నివాసానికి దూదేకుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, ప్రధాన కార్యదర్శి షేక్ నసీరుల స్థానిక నేతలతో కలిసి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి శిక్ష పడేవరకు తమ సంఘం తరపున పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్ హుస్సేన్ సాహెబ్, ఖలీల్, చిన్నా, రఫీ, దిల్షాద్, షాకీరా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి చెరువులను కాపాడాలి

కావలి,జూలై29: ఆక్రమణదారుల చెర నుంచి ముసునూరు మందాటి చెరువు, బోగోలు మండలం కోవూరుపల్లి చెరువులను కాపాడాలని మందాటి చెరువు పరిరక్షణ సమితి నాయకుడు కనుమూరి బాస్కర్‌రెడ్డి,దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం వారు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం బాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మందాటి చెరువు ప్రాంతంలో స్థానికేతరులు వచ్చి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ముసునూరు వాసులు కొద్దికొద్దిగా ఆక్రమిస్తున్నా కొత్తగా స్థానికేతరులు చొరబడి ఆక్రమించుకున్నారన్నారు. ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో రమణయ్య, డీ జార్జి, బాబు, పీ. శ్రీనివాసులు, చెరు కూరు జనార్దన్, పీ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో కావలి విద్యార్థుల ప్రతిభ

కావలిటౌన్, జూలై29: సంతపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో కావలి మండలం కొత్తసత్రం జడ్పీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పతకాలు సాధించారు. సోమవారం విజేతలను పాఠశాలలో అభినందించారు. 12 ఏళ్ల విభాగంలో ఎల్లంగారి జ్యోతి, పామంజి సరిత ప్రథమ స్థానం, వాయిల శాలిని ప్రీస్టైల్ విభాగంలో రెండవ స్థానం, అండర్ 14లో కల్పన రెండవ స్థానం సాధించారు. విజేతలను హెచ్ఎం శ్రీనివాసరావు, పీడీ మురళి, గ్రామ కాపులు అభినందించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్ ప్రారంభం

కావలిటౌన్, జూలై29: జనసేన నాయకులు సిద్దు ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుసూదనరావు పాల్గొని భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో రంగా యువసేన అధ్యక్షుడు దేవరకొండ శ్రీను, మధుసూదన్‌రెడ్డి, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న మధుబాబునాయుడు, సిద్దు తదితరులు

అధిక మొత్తాలు వసూలు చేస్తే రిజిస్ట్రేషన్ల రద్దు

కావలిటౌన్, జూలై29: రోగుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తే ఆయా ల్యాబ్ రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రజిత పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని క్రిస్టియన్‌పేటలోని ప్రైవేట్ ఆసుపత్రుల ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లను ఆమె తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించి ఏపరీక్షకు ఎంత వసూలు చేయాలో.. ఎంత వసూలు చేస్తున్నారు.. అని ఆరా తీశారు. కొన్ని ఆసుపత్రుల ల్యాబ్ నిర్వాహకులు, స్కాన్ సెంటర్ల నిర్వాహకులు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయని తీరు మార్చుకోవాలని ఆమె హెచ్చరించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం : మండలంలోని అన్నెబోయినపల్లి మన్నేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎం బాజీబాబు, సిబ్బందితో సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో మన్నేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గ్రామ శివారులో దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు.నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కలిగిరి : పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెంలో సాగుచేస్తున్న కెఎన్ఎమ్-1638రకం వరిని సోమవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వింజమూరు ఏడీఏ రామిరెడ్డి మాట్లాడుతూ వరిపైరులో సస్యరక్షణ చర్యలు తప్పనిసరని, కెఎన్ఎమ్-16 38 రకం ఆకులో ప్రస్తుతం నల్లతెగులు సోకిందని, దీంతో ఆకులు ఎండిపోయే అవకాశం ఉందన్నారు. నివారణకు ఎకరానికి 400ఎంఎల్ ప్రొపెనోపాస్ లేదా 200ఎంఎల్ ఒబెరాన్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు, వీఏఏ సుజాత పాల్గొన్నారు.

బుచ్చిలో ప్రబలిన అతిసార

- బెంబేలెత్తుతున్న గ్రామస్థులు
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం



ఖాజానగర్‌లో దుర్గంధం వెదజల్లుతున్న గుడపల్లి కాలువ



బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేరిన అతిసార రోగులు.

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 29: బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని వవ్వేరు, ఇస్కపాళెం పంచాయతీలోని ఇస్కపాళెం, పల్లాప్రోలు, మినగల్లు, పెనుబల్లి, జొన్నవాడ తదితర గ్రామాలలో అతిసార వ్యాధి ప్రబలడంతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. సోమవారం 25మందికిపైగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ బుచ్చి ప్రభుత్వా సుపత్రి (సీహెచ్‌సీ)కి రాగా, వారిలో కొంతమంది వైద్య సేవలతో సరిపెట్టుకుని వెళ్ళిపోగా ఐదుగురు ఆసుపత్రిలో చేరగా వారికి వైద్యులు వైద్యసేవల ందించారు. కాగా, సోమవారం ఆంధ్రజ్యోతిలో 'బుచ్చి ప్రభుత్వాసుపత్రి లో అందని వైద్యం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే.

పారిశుధ్య లోపంతో ప్రబలుతున్న వ్యాధులు

పారిశుధ్య లోపంతో పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలలో వ్యాధులు ప్రబలుతున్నాయి. బుచ్చిలోని పాత, కొత్త గుడపల్లి కాలువలు, రేబాల కాలువ, మలిదేవి కాలువ దుర్గంధం వెదజల్లుతున్నాయి. కాశీపాళెం, పెద్దూరు, కాశీపాళెం తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోయి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపర్చి వ్యాధులను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యాదీవెనకు సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుపై హర్షం

మనుబోలు, జూలై 29: ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకానికి మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాదీవెనగా పేరు మార్చడంపై సర్వేపల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, గురివిందపూడి టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్‌శర్మ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి సతీష్, సభ్యులు బి రామచంద్రారావు, టి బాలకృష్ణమూర్తి, సర్వేపల్లి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శుల నియామకం

మనుబోలు, జూలై 29: మండలంలోని పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ సోమవారం తెలిపారు. మేజర్ పంచాయతీ అయిన మనుబోలుకు ఇన్‌చార్జి కార్యదర్శిగా బద్దెవోలు కార్యదర్శి ప్రసాద్‌ను, జట్లకొండూరు, బండేపల్లి పంచాయతీలకు పిడూరు పంచాయతీ కార్యదర్శి ఎం కృష్ణవేణిని, అక్కంపేట, వడ్లపూడి పంచాయతీలకు వీరంపల్లి కార్యదర్శి కే రాజేశ్వరిని ఇన్‌చార్జిలుగా నియమించినట్లు ఎంపీడీవో వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, జూలై 29: మండలంలోని కసుమూరు పంచాయతీ వడ్డిపాళెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన మునీర్ బాషా దైవదర్శనం కోసం మోటార్‌బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా వడ్డిపాళెం స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో మునీర్ బాషాకు గాయాలయ్యాయి. క్షతగ్రాతుడిని చికిత్స నిమిత్తం వెంకటాచలంలోని సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముసురుతో పంటలకు తెగుళ్లు

- ఆందోళనలో అన్నదాతలు

తోటపల్లిగూడూరు, జూలై 29: ఇటీవల గత కొన్ని రోజులుగా మబ్బులు ఆవరించి ముసురు ఏర్పడడంతో పంటలకు తెగుళ్లు సోకుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పైర్లు వెన్ను, పొట్ట దశలో ఉన్నాయని, ఎన్ని మందులు పిచికారీ చేసినా పనిచేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు సూచనలు సలహాలు ఇవ్వడం లేదని పలువురు రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదేవిధంగా ముసురుతోపాటు వర్షం కురిస్తే పైర్లు దెబ్బతిని పంట దిగుబడి తగ్గిపోతుందని, పంటలపై అధిక పెట్టుబడులు పెట్టామని సరైన దిగుబడి రాకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పండుగ వాతావరణంలో శుభ దిన్ భోజన్

తోటపల్లిగూడూరు, జూలై 29: మండలంలోని కోడూరు పంచాయతీ కొత్త పట్టపుపాళెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం ఏర్పాటుచేసినట్లు ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, జయరామానాయు డు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయ మన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. మాజీ విద్యా కమిటీ చైర్మన్ పామంజి దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు రామాంజనేయులు, సాయిరాం, కుమారి వెంకటేశ్వర్లు, చలపతి, బ్రహ్మయ్య, ప్రభాకర్ బాబు, ప్రధానోపాధ్యాయులు సునీత, సత్యసేన, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ పెంచల లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో

●**బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిలోని డీఎల్ఎన్, ఆర్ హైస్కూలు, మండలంలోని పెనుబల్లిలో జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు ప్రత్యేక ఆహార పదార్థాలతో సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు బుచ్చిలో ఎంవీ శేషయ్య, పెనుబల్లిలో సర్పంచు పెంచలయ్య, మినగల్లులో సర్పంచు పూజిత, సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నాయకులు వల్లెపు దశరథ, దుగ్గిశెట్టి హరనాథ్, ఉసురుపాటి ప్రసాద్, జనసేన ప్రసాద్, మాధవ్, పెనుబల్లిలో ఉపాధ్యాయులు, ప్రసాద్, సురేష్‌రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు సన్మానం

కోవూరు: ఇనమడుగు జడ్పీ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన టీడీపీ పార్లమెంటు కమిటీ కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొల్లారెడ్డి సునీల్‌రెడ్డి, స్థానిక నాయకుడు సునీష్‌రెడ్డిలను పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొల్లారెడ్డి సుధాకరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల్ని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు.

శుభ్ దిన్ భోజన్ పథకానికి చేయూత

ముత్తుకూరు: శుభదిన్ పథకానికి ముత్తుకూరుకు చెందిన జ్యోతిష్య శిరోమణి డాక్టర్ జీవిబి మురళీకృష్ణ చేయూతనందించారు. ప్రాథమికోన్నత మెయిన్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆహార పదార్థాలను ఎంఈఓ మధుసూదన్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ శుభదిన్ భోజన్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీశ్వరి, ఏపీటీఎఫ్ నాయకులు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఎమ్మెల్యే సోమిరెడ్డి లేఖ

పొదలకూరు, జూలై 29: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సోమవారం లేఖ రాశారు. పొదలకూరు, మనుబోలుతో పాటు రాపూరు, కలువాయి, చేజర్ల, సైదాపురం మండలాల పరిధిలో డయాలసిస్ బాధితులు ఉన్నారని, వీరంతా ప్రస్తుతం వ్యవప్రయాలకు ఓర్చి నెల్లూరుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3.80కోట్లతో పొదలకూరులో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సకల వసతులతో నిర్మించామని, అందులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అన్ని వసతులు ఉన్నాయని, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నెల్లూరు ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల హౌస్ సర్జన్ల సేవలను ఎస్పీఎం విభాగం ద్వారా పొదలకూరు సీహెచ్‌సీకి కూడా విస్తరించాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

... M/s. Shriram Finance Ltd., Gudur ...

SCHEDULE

... "ICONIC OCEAN EDGE" ...

P.Bhaskar Rao, B.Sc., B.L., Advocate, 13/26, Kummari Street, Gudur

రైల్వే వ్యాగిన్ కూలీల ధర్నా



ధర్నా చేస్తున్న రైల్వే వ్యాగిన్ కూలీలు

కోవూరు, జూలై 29: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పడుగుపాడు రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే వ్యాగిన్ కూలీలు సోమవారం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి రైల్వే వ్యాగిన్ లోడింగ్, అన్‌లోడింగ్ కూలీల నెల్లూరు నగర కమిటీ ప్రధాన కార్యదర్శి జీ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌కు పడమర వైపు రోడ్డుకు మరమ్మతులు చేయాలని, రైల్వే వ్యాగిన్ కూలీలకు విశ్రాంతి భవనం నిర్మించాలని, తాగునీటి వసతి కల్పించాలని డిమాండు చేశారు. ఈ ఆందోళనలో సీఐటీయూ నాయకులు మూలం ప్రసాద్, వేణు, వెంకటేశ్వర్లు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కాలువల్లో పూడిక తీయించండి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 29: బుచ్చిలోని ప్రధాన కాలువలు, పాత గుడపల్లి, కొత్త గుడపల్లి, రేబాల కాలువలలో పూడిక తీయించాలని సీపీఎం నాయకులు సోమవారం నగర పంచాయతీ అధికారులను కోరారు. ఏళ్ళ తరబడి గుడపల్లి కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. దీంతో దోమలతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశ ముందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పి శ్రీనివాసులు, మునీర్ అహ్మద్, జానీబాష, శ్రీనివాసులు, ఖాదర్‌బాష, మల్లికార్జున, కోటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు



భూరీసర్వేలో అవకతవకలపై గ్రామస్థుల ఆందోళన

మనుబోలు, జూలై 29: జగనన్న భూరీసర్వే అంతా అవకతవకల మయం అంటూ కొమ్మలపూడి గ్రామస్థులు టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలోని వైసీసీ నాయకుడు చెందులూరు శ్రీనువాసులు చేసిన ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రజా సమస్యల వేదికలో ఇన్‌చార్జి తహసీల్దార్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ చెందులూరు శ్రీనువాసులు, గుర్రం ప్రసాద్, గుర్రం ప్రభాకర్‌లు ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో గుర్తించి, ఐదేళ్ల వైసీపీ పాలనలో కబ్జాలు చేసి, దర్జాగా పట్టాలు తెచ్చుకున్నారని ఆరోపించారు. అనంతరం మాజీ ఎంపీటీసీ పెంచలయ్య మాట్లాడుతూ కొమ్మలపూడి రెవెన్యూలో 48 ఎకరాల వరకు వైసీపీ నాయకులు భూకబ్జాలు చేశారని ఆరోపించారు. టీడీపీ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ తనకున్న 2-42 సెంట్ల పొలానికి శ్రీనువాసులు పేరుతో రికార్డులు సృష్టించి పాసు పుస్తకాలు ఇచ్చారన్నారు. దీనిపై కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను బయటకు తీసి, ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెమాల ఆదినారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి, హరిబాబు, ఉమామహేశ్వరరెడ్డి, గుమ్మా శ్రీనువాసులు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కొమ్మలపూడి గ్రామస్థులు

పాఠశాలల్లో శుభ్‌దిన్ భోజన్



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న అధికారులు

నెల్లూరు(విద్య), జూలై 29 : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్ఎస్ఏ అకడమిక్ మానటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు తెలిపారు. అందులో భాగంగా ఆయన నిడిగుంటపాళెంలోని మండల పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి మాట్లాడారు. కవిత ఇరిగినేని తన భర్త రమేష్ జ్ఞాపకార్థం చివరిరోజున పిల్లలకు విందుభోజనం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చలపతి, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం పార్వతీశం, సీఆర్‌పీ మల్లికార్జున్, ఉపాధ్యాయులు కవిత, మాధవ్, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగరపాలక పాఠశాలలో...

కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్ఎం ఎం.భాస్కర్‌రావు తెలిపారు. తమ సొంత నిధులను వెచ్చించి విద్యార్థులకు ఆహారాన్ని అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చిన అర్జీ మళ్లీ రాకూడదు

- మీ పనితనానికి వచ్చే సోమవారం వరకు గడువు : కమిషనర్



నగర వాసుల నుంచి సమస్యలు వింటున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), జూలై 29 : నా వద్దకు నగర వాసుల నుంచి ఈరోజు వచ్చిన సమస్య మళ్లీ రాకూడదు. వచ్చే సోమవారంలోపు ఆ సమస్య పరిష్కారమవ్వాలి. ఇదే మీ పనితనానికి గడువు అంటూ ఎన్ఎంసీ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అధికారులకు సూచించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితుల నుంచి ఒక్కసారి వచ్చిన అర్జీ మళ్లీ మళ్లీ రాకూడదన్నారు. దీనిని బట్టే అధికారుల పని తనం బేరీజు వేస్తానంటూ స్పష్టం చేశారు. ప్రజల నుంచి తీసుకున్న సమస్య వినతిని వారంలోపు పరిష్కారం జరగాలన్నారు. అదే సమస్య పునరావృతమైతే సహించనంటూ తెగేసి చెప్పారు. సమస్య ఎక్కడుంటే మీరు అక్కడికి వెళ్లాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇన్‌చార్జి జేసీగా బాధ్యతలు స్వీకరించారు.

ఇంటిలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన

నెల్లూరు(క్రైం), జూలై 29: నెల్లూరులో ఇటీవల జరిగిన రొట్టెల పండుగలో గంధ మహోత్సవం రోజున చెన్నైకి చెందిన వృద్ధ దంపతులు తమ బ్యాగ్‌ను పోగొట్టుకొని దిక్కుతోచని పరిస్థితిలో ఉండగా గమనించిన ఇంటిలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ మస్తాన్ వారికి అండగా నిలిచారు. వారికి భోజనం పెట్టించి ఆటో చార్జీలతో పాటు వారి ప్రాంతానికి వెళ్లేందుకు రూ.500 ఇచ్చారు. ఆ సమయంలోటే హెడ్ కానిస్టేబుల్ ఫోన్ నెం తెలిపితే నగదు ఆన్‌లైన్ ద్వారా పంపుతామని తెలిపినా అందుకు ఆయన అంగీకరించలేదు. దీంతో ఆ వృద్ధ దంపతులు తమ ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచి నెల్లూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి రూ.500 జత చేసి ఓ లేఖ రాసి పోస్ట్ ద్వారా పంపారు. ఆ లేఖ చూసిన ఎస్పీ కృష్ణకాంత్ హెడ్ కానిస్టేబుల్ మస్తాన్‌ను సోమవారం తన కార్యాలయానికి పిలిపించి అభినందించారు.

ప్రాధాన్యత క్రమంలో సంక్షేమ పథకాల అమలు

- విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే



సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూలై 29 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ప్రాధాన్యత క్రమంలో సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు పాలనపరంగా అడుగులు వేస్తున్నారని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం అక్కచెరువుపాడు వద్ద రూ.5 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, నిరుపేదలకు అండగా నిలిచేందుకు ఎన్నికలకు ముందు పలు పథకాల అమలకు హామీ ఇచ్చారన్నారు. కొత్తూరు వద్దనున్న 30, 31వ డివిజన్ల అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. గతంలో ఇక్కడ సబ్‌స్టేషను ప్రారంభిస్తానని తాను ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు తెలిపారు. ఇక నుంచి ఈ ప్రాంతంలో విద్యుత్‌పరమైన సమస్యలుండవన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బత్తల మంజుల, నాయకులు రాజానాయుడు, సుజయ్‌బాబు, కృష్ణ, కూకటి హరియాదవ్, మన్నేపల్లి రఘూ, మస్తాన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బయ్య శాస్త్రికి 'ఆగమ వాస్తు శేఖర' బిరుదు



జ్ఞాపిక అందుకుంటున్న సుబ్బయ్య శాస్త్రి

నెల్లూరు రూరల్, జూలై 29 : నెల్లూరు రూరల్లోని పెద్ద చెరుకూరుకు చెందిన శైవాగమ పండిట్, ఏపీ ప్రభుత్వ ఆగమ అర్చక పరీక్షాధికారి నూతలపాటి సుబ్బయ్యశాస్త్రికి అరుదైన గౌరవం దక్కింది. సోమవారం తెలంగాణలోని నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం చెరువుగట్టులో సోమేశ్వర శివజ్ఞాన పీఠం వారు సుబ్బయ్య శాస్త్రి సేవలను గుర్తించి 'ఆగమ వాస్తు శేఖర' బిరుదును ప్రదానం చేశారు. పెద్దచెరుకూరులోని చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడిగా కొనసాగుతుండగా, ఈ ఆలయ నిర్మాణ ఆగమ వాస్తు సిద్ధాంతిగా, జిల్లాలోని ప్రముఖ ఆలయాల నిర్మాణంలో ఆగమ వాస్తు సిద్ధాంతిగా కూడా ఆయన వ్యవహరించారు.

జాతీయ యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నెల్లూరు(విద్య), జూలై 29 : తమిళనాడులోని చెన్నై రామకృష్ణ పాఠశాలలో ఆదివారం జరిగిన 12వ సౌత్ ఇండియా యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పురుషుల 56 ఏళ్ల పైబడిన విభాగంలో రఘురామయ్య ద్వితీయస్థానం, ప్రభాకర్‌నాయుడు తృతీయస్థానం, దయాల్‌దాస్ ఐదోస్థానం సాధించారని జిల్లా యోగా మాస్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. అనంతరం జాతీయ యోగా గురువు ఇలంగోవన్ జిల్లా క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు.

వేదగిరి క్షేత్రంలో భారత కోస్ట్ గార్డు ఉన్నతాధికారి పూజలు



నెల్లూరు రూరల్ : వేదగిరి క్షేత్రంలో రాజేష్ మిట్టల్

నెల్లూరు రూరల్/ బుచ్చిరెడ్డిపాళెం, జూలై 29 : విశాఖ పట్టణానికి చెందిన భారత కోస్ట్ గార్డు విభాగం ఉన్నతాధికారులు రాజేష్ మిట్టల్, అజిత్‌కుమార్ పరబ్, ప్రొటోకాల్ అధికారి రాజు, లైసెన్స్ అధికారి జగదీష్ సోమవారం వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, జొన్నవాడ కామాక్షితాయి ఆలయాలను సందర్శించారు. ముందుగా వారికి ఆయా ఆలయాల అధికారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్ల సన్నిధిలో పూజలు చేశారు. వేదగిరి క్షేత్రం విశిష్టతను ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు వివరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో గిరికృష్ణ ఉన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 29: నగరంలోని వెంకటేశ్వరపురంలో దివ్యాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక వైద్యుడు నరసాపురం ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా పేద వృద్ధులకు చీరలు, పంచలు పంపిణీ చేశారు.

జనసేనలో క్రమశిక్షణతో నడుచుకోవాలి

- జిల్లా పర్యవేక్షకుడు అజయ్



సమావేశంలో మాట్లాడుతున్న వేములపాటి అజయ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 29: జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను మననం చేసుకుంటూ క్రమశిక్షణగా నడుచుకోవాలని ఆ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, నెల్లూరు జిల్లా పర్యవేక్షకుడు వేములపాటి అజయ్ సూచించారు. నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం అజయ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రజలకు అండగా ఉండటం వల్ల రాష్ట్రంలో, కేంద్రంలో పార్టీకి విశేష ఆదరణ లభించిందన్నారు. పార్టీ అధ్యక్షుడే శాసనసభలో తాను తప్పు చేసినా శిక్ష వేయాల్సిందేనంటూ అసెంబ్లీ సాక్షిగా తెలిపి తన హుందాతనాన్ని చాటుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్ జిల్లా ఇన్‌చార్జి చదలవాడ రాజేష్, సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. సోమవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ క్రియాశీలక సభ్యత్వం జిల్లాలో 10 వేలలోపు ఉండేదని, ఈ ఏడాది ఇప్పటికే 25 వేలు దాటిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఎంపీ వేమిరెడ్డి భేటీ

నెల్లూరు(హరనాథపురం), జూలై 29 : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని సోమవారం నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించారు. జిల్లాలోని సహజ వనరులు, గనులకు సంబంధించి పలు విషయాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

లయన్స్ క్లబ్ ప్రతిభ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 29: నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ప్రతిభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షుడుగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రూపేష్, కోశాధికారిగా వరద శ్రీధర్, ఇతర కార్యవర్గ సభ్యులు కాబోయే ప్రెసిడెంట్ ఎం సతీష్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. వియానీ హోమ్‌లో విద్యార్థుల కోసం బియ్యం, నోటు పుస్తకాలు, ప్రోటీన్ పౌడర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ అంజనేయులు, రామమోహన్‌రావు, శ్రీధర్, కృష్ణచైతన్య, విష్ణుకుమార్, ఎస్‌వీఎస్ రామమోహన్‌రావు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారికి తిరువాడిప్పర ఉత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 29 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం ఆండాళ్ అమ్మవారికి తిరువాడిప్పర ఉత్సవం జరిగింది. ఉదయం తిరుమంజనం సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి విశేష అలంకారంతో ఆండాళ్‌కు ప్రాకార ఉత్సవం, మాల మార్పు వేడుక, ఊంజల్ సేవ కనుల పండువగా జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా ఎస్‌వీ బాలాజీ, జయంతి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

జీవనోపాధులు మెరుగుపరచుకోవాలి

- పొదుపు సంఘాల శిక్షణలో డీసీవో గురప్ప

నెల్లూరు(హరనాథపురం), జూలై 29: పొదుపు సంఘాల మహిళలు మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొని జీవనోపాధులను మెరుగుపరచుకోవాలని జిల్లా సహకారశాఖాధికారి బి.గురప్ప అన్నారు. టీపీ గూడూరు మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న పొదుపు సంఘాల సభ్యులకు సోమవారం ఆయన చాంబర్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గురప్ప మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఆశయాలు, ఉద్దేశ్యాలను మహిళలకు వివరించారు. సహకార సంఘం రిజిస్టర్ అయిన తరువాత నిర్వహించాల్సిన సమావేశాలు, పుస్తక నిర్వహణ, ఆడిటింగ్, ఎన్నికలు, సభ్యత్వ అర్హతలు, పాలకవర్గ సభ్యుల అర్హతల గురించి వారికి తెలియచేశారు.

తాళాలు వేసిన ఇంట్లో చోరీ


- ఆలస్యంగా వెలుగులోకి..

నెల్లూరు(క్రైం), జూలై 29: ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు నగలు, నగదు దోచుకెళ్లిన ఘటన వెంకటేశ్వరపురంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురం డాన్‌బాస్కో స్కూలు సమీపంలో ఆర్టీసీ డ్రైవర్ నాగేశ్వరరావు నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం ఈ నెల 24వ తేదీన రాయవేలూరులోని సీఎంసీ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. రూ.25 వేల, మూడుసవర్ల బంగారు ఆభరణాలును దోచుకెళ్లారు. సోమవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చిన బాధితుడు ఇంటి తలుపులు తెరిచి చూడగా బీరువాలోని వస్తువులు కన్పించలేదు. నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

పులికాట్‌లో జలకళేదీ?





శ్రీహరికోట సమీపంలో అడుగంటిన నీరు - అట్టకానితిప్ప వద్ద ఎడారిని తలపిస్తున్న పులికాట్

ఏడాది పొడవునా జలకళతో కళకళతుండిన పులికాట్ సరస్సు నేడు ఎడారిని తలపిస్తోంది. సాధారణంగా జూన్, జూలై మొదటి వారంలో కురిసిన వర్షాలతో పులికాట్ జలకళ సంతరించుకునేది. వర్షపు నీరే కాకుండా ఆటుపోట్లతో సముద్ర జలాలు రావడంతో నిండుకుండను తలపించేది.జాలర్ల ముఖాల్లో కూడా ఆనందం వెల్లివిరిసేది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కుదిరి నుంచి సరస్సు అంచుల్లో మత్స్యకారులు చేపలను వేటాడేవారు. కొరిడి - పేర్నాడు, వేనాడు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో రహదారి వెంబడి విసురు వలలు, తెరచాప పడవలతో వేట కొనసాగిస్తుంటే తీరం వెంబడి సందడి కన్పించేది. అయితే రెండు వారాలుగా తీరం వెంబడి వేడి గాలులు వీస్తూ ఎండలు కాస్తుండడంతో సరస్సులో ఉన్న నీరు అడుగంటి ఎడారిని తలపిస్తోంది.వర్షమొచ్చినప్పుడే నీరుండి మిగిలిన సమయాల్లో అడుగంటిపోతుండడంతో పులికాట్‌పై ఆధారపడి జీవించే జాలర్ల బతుకు ప్రశ్నార్థకంగా మారింది.ముఖద్వారాల్లో పూడికతీతతో పులికాట్‌కు పూర్వవైభవం తీసుకొస్తామంటూ వైసీపీ నేతలు ఐదేళ్లు మాటలతోనే కాలం వెళ్లబుచ్చారు. ప్రస్తుత ప్రభుత్వమైనా పులికాట్‌కు పూర్వవైభవం తీసుకొస్తుందని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- సూళ్లూరుపేట

తీసుకోవాల్సిన చర్యలివే

పులికాట్ సరస్సులో ఏడాది పొడవునా నీరుండాలంటే సముద్రం, సరస్సుకు మధ్యలో ముఖద్వారాల పూడికతీత తీయాలి. వాకాడు మండలం పూడిరాయదొరువు, కొండూరుపాళెం వద్ద రెండు ముఖ ద్వారాలున్నాయి. అదే విధంగా తమిళనాడు పరిధిలోని పళ్లవర్‌కాడు వద్ద మరో ముఖద్వారం ఉంది. వరదల సమయంలో వచ్చే ఆటుపోట్లకు ఇసుకమేటలతో ముఖ ద్వారాలు పూడిపోయాయి. 20ఏళ్ల నుంచి పూడికతీత అంటున్నారే తప్ప పనులు ప్రారంభించలేదు. ముఖద్వారాల్లో పూడిక తీస్తే సముద్రం నుంచి ఉప్పునీరు సరస్సులోకి ప్రవేశించి ఏడాది పొడవునా పులికాట్ జలకళతో ఉంటుంది.

ముందుకు సాగని పూడికతీత పనులు

ఈ ప్రాంతానికి పర్యాటకంగా పేరొచ్చిందంటే పులికాట్ వల్లే. 15 ఏళ్లుగా సరస్సు అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. అభివృద్ధి పనులకు కేంద్రప్రభుత్వం అనుమతి తప్పనిసరి కావడంతో ప్రతిపాదనలు పంపినా జాప్యం జరుగుతోంది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పూడికతీతకు చర్యలు చేపట్టి రూ.48 కోట్లు మంజూరు చేసింది. అనంతరం ప్రభుత్వం మారడంతో ఆచరణకు నోచుకోలేదు. కేంద్రప్రభుత్వం సాగరమాల ప్రాజెక్టు కింద రూ.100 కోట్లతో పనులు చేయిస్తామని ప్రకటించి హడావిడి చేసినా కార్యరూపం దాల్చలేదు.

విద్యానగర్ యూనియన్ బ్యాంక్‌లో మంటలు

కీలక ఫైళ్లు దగ్ధం?



బ్యాంక్‌లోపల నష్టాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

కోట, జూలై 29 :కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న యూనియన్ బ్యాంక్‌లో సోమవారం రాత్రి మంటలు ఎగిసిపడ్డాయి. బ్యాంక్ లోపల ఏమైందో తెలియదు కానీ 8 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు బయటకు చిమ్మాయి. ఒక పక్క వర్షం వస్తుండగా, చిట్టమూరు మండలం నార్త్‌వత్తూరుకు చెందిన ఓ యువకుడు అటువైపు వెళ్తూ మంటలను చూసి విద్యాసంస్థల సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు.కోట అగ్నిమాపక కేంద్రానికి సెక్యూరిటీ సిబ్బంది ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలను అతికష్టంపై ఆర్పారు. మేనేజర్ క్యాబిన్ నుంచి మంటలు కంప్యూటర్లున్న రూంలోకి పాకడంతో కంప్యూటర్లు, పలు కీలకమైన రికార్డులు పూర్తిగా కాలిపోయాయి.అయితే లాకర్‌కు, ఏటీఎంకు ప్రమాదం జరగలేదని బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు.మంగళవారం బ్యాంక్ సేఫ్టీ అధికారులు వచ్చి ప్రమాదంపై పూర్తి వివరాలు సేకరిస్తారని చెప్పారు. బ్యాంక్‌లో మంటలు అదుపులోకి రావడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న అధ్యాపకులు, హాస్టల్‌లో ఉంటున్న బాలికలు ఊపిరి పీల్చుకున్నారు.



బ్యాంక్ లోపల ఎగిసిపడుతున్న మంటలు



బ్యాంక్‌లోపల మిగిలిన ఫైళ్ల పరిశీలన

నాన్నా.. ఇదేం పని?

- చార్జింగ్ వైరుతో కుమార్తె మెడకు బిగించి హతమార్చిన తండ్రి

రొంపిచెర్ల, జూలై 29: చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలో 9వ తరగతి చదివే గౌతమిని ఆమె తండ్రే కడతేర్చాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రొంపిచెర్ల ఇన్‌చార్జి అయిన కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నడింపల్లెకు చెందిన కె.గౌతమి పెద్దమల్లెల జడ్పీఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. 16 నెలల క్రితం తల్లి మరణించింది. అవ్వ ఆదరణలో ఉండగా.. ఆమె కూడా ఆరు నెలల కిందట మృతి చెందింది. అనంతరం తండ్రి మునిరత్నం గౌతమిని పోషించేవాడు. తండ్రీ కూతుళ్ల మధ్య తరచూ చిన్న చిన్న గొడవలు వచ్చేవి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆమె గొంతుకు సెల్‌ఫోను చార్జింగ్ వైరుతో బిగించడంతో ఆమె మృతిచెందింది. దీనిపై గౌతమి మేనమామ జయరాం సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎంఈవో-2 శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాగా చదివే విద్యార్థినిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.



మృతి చెందిన గౌతమి

లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్‌లో ఫైళ్ల కాల్చివేత కేసు ఎఫెక్ట్

గతంలోనూ క్రమశిక్షణా చర్యలు

పెద్దిరెడ్డికి సన్నిహితుడిగా ముద్ర

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29: తిరుపతి జిల్లా లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీని సస్పెండ్ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత కేసులో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఆర్డీవోలు సహా ఒక సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.వీరిలో మదనపల్లి ఆర్డీవోగా పనిచేస్తూ తిరుపతికి ఫిబ్రవరి మాసంలో బదిలీపై వచ్చిన మురళి ఒకరు. సుమారు పది రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను కొంతమంది దగ్ధం చేసిన విషయం తెలిసిందే. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం... అనేక అవకతవకలు జరిగినట్లు గుర్తించడం..వీటిలో మురళీకి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు పడింది. మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మురళి అత్యంత సన్నిహితుడు.ఒంగోలులో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో మదనపల్లెలో పని చేస్తుండగా సస్పెండ్ చేయడంతో పాటు తహసీల్దారుగా రివర్షన్ సైతం ఇచ్చారు.పెద్దిరెడ్డి జోక్యంతో సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు రివర్షన్ కూడా ఉపసంహరించుకున్నారు. ఆరు నెలల క్రితం మురళి తిరుపతికి లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు.



మురళి

హరోం హర

ఆలయాల్లో ఆడికృత్తిక సందడి



ఆనందగిరిపై భరణీ దీపోత్సవం

ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు 'హరోం హర' నామస్మరణతో మార్మోగాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన ఆలయంలో సోమవారం రాత్రి నెమలి వాహనంపై వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి పురవిహారం చేశారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించారు.పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామికి కాణిపాక దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సమర్పించారు.ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం భరణీ దీపోత్సవం వేడుకగా నిర్వహించారు.రాత్రి నెమలివాహనంపై సుబ్రమణ్యస్వామిని ఊరేగించారు. చిత్తూరు జిల్లా గుడుపల్లెలోని వేపమాను కొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి దర్శనానికి వేలాదిమంది భక్తులు పోటెత్తారు. స్వామిమాలలు వేసుకొని కావళ్లు, తేరు కావళ్లు, నోటికి ఇనుప చూలాలు గుచ్చుకొని, శరీరం మొత్తం నిమ్మకాయలను గుచ్చుకొని, రాతి గుండును తాళ్లతో ఇనుప కొక్కేలను వీపునకు గుచ్చుకొని లాగుతూ, తేరు ఇనుప చువ్వలు గుచ్చుకొని, క్రేన్‌కు కొక్కేలతో వేలాడుతూ.. ఇలా వివిధ రూపాల్లో భక్తులు తమ గ్రామాల నుంచి డప్పువాయిద్యాలతో కొండపైకి చేరుకున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి సోమవారం లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు.కొండ దిగువ, పైనా భక్తులు పూల కావళ్లు, పాల కావళ్లు, పన్నీరు కావళ్లు మోసుకెళ్లి స్వామి వారికి సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



గుడువంకలో వీపునకు ఇనుప చువ్వలు గుచ్చుకొని క్రేన్ సాయంతో వేలాడుతూ ఆలయానికి వస్తున్న భక్తులు



శ్రీకాళహస్తి మాడవీధుల్లో నెమలి వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు



తిరుత్తణిలో కావళ్ల సందడి

కిడ్నాప్ కేసులో ఆర్‌ఎంపీ సహా నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూలై 29: తిరుపతికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి జంగం భాస్కర్ కిడ్నాప్ కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాకు కిడ్నాప్ కేసుకు సంబంధించి వివరించారు.చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందర పల్లెకు చెందిన జంగం భాస్కర్ తిరుపతిలో కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ ఆటో నడుపుకుని జీవిస్తున్నాడు.ఇటీవల ఆర్థికంగా బాగా ఎదగడంతో అతడిని కిడ్నాప్ చేసి భారీ ఎత్తున డబ్బు సంపాదించవచ్చని చిన్నగొట్టిగల్లుకు చెందిన బాతుకోళ్ళ మహ్మద్ జీషాన్, ఇర్ఫాన్ పథకం పన్నారు. సొంత పనిమీద స్వగ్రామానికి వెళ్లిన భాస్కర్ ఈ నెల 24న ఉదయం 8.45 గంటల ప్రాంతంలో తన ఆటోలో తిరుపతికి వస్తుండగా జీషాన్, ఇర్ఫాన్ తమ స్నేహితులైన బెంగళూరులోని శివాజీనగర్‌కు చెందిన ఆర్యంఖాన్, లింగరాజుపురానికి చెందిన మహ్మద్ ఖాసిం సహాయంతో భాకరాపేట ఘాట్‌రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో కిడ్నాప్ చేశారు. అతను అరవకుండా మహల్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ షేక్ జాహిద్ బాషా నుంచి కొనుగోలు చేసిన మత్తు మందును భాస్కర్‌కు ఇచ్చారు. ఎలాగైనా కిడ్నాప్ చేసి భారీ ఎత్తున డబ్బులు డిమాండ్ చేయాలనే ఆలోచనతో అంతకుముందు భాస్కర్ కదలికలపై రెక్కీ నిర్వహించారు.భాస్కర్‌ను రోజంతా తమ కారులోనే వివిధ ప్రాంతాల్లో తిప్పారు. భాస్కర్ కుమారుడు కిరణ్‌కు ప్రధాన నిందితుడు మహ్మద్ జీషాన్ ఫోన్ చేసి రూ.5 కోట్లు తెచ్చివ్వాలని బెదిరించారు. దీంతో కిరణ్ ఎస్పీకి ఫోన్ చేసి కిడ్నాప్ విషయం తెలిపాడు.వెంటనే ఏఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో క్రైం డీఎస్పీ రవికుమార్, సీఐలు శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, వినోద్‌కుమార్, సీఐ మస్తాన్ వలి నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు.కిడ్నాప్ కోసం వాడుతున్న కారును 29న ఉదయం 7గంటల ప్రాంతంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో ఊర్జా హోటల్ వద్ద గుర్తించారు.అయితే పోలీసు వాహనాన్ని ఢీకొట్టి పరారైన నిందితులను కాలూరు క్రాస్ వద్ద అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు వాడిన కారు, డమ్మీ పిస్టల్, మత్తు ఇంజెక్షన్లు ఇవ్వడానికి వాడిన సిరంజీలను స్వాధీనం చేసుకున్నారు.ఇర్ఫాన్ తప్పించుకోగా ఆర్‌ఎంపీతో పాటు ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశారు.ముద్దాయిల్లో మహ్మద్ జీషాన్ కిరాతకమైన నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.మిగిలిన వారిపైనా బెంగళూరు, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లో ఎర్రచందనం, దోపిడీ, దొంగతనం కేసులున్నాయని, వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

నిందితులపై రౌడీషీట్ తెరిచేందుకు ఎస్పీ ఆదేశాలు



కిడ్నాపర్లను చూపించి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

సముచిత స్థానం కల్పించండి

సర్పంచుల వినతి



కృష్ణతేజకు వినతిపత్రం అందిస్తున్న శివకుమార్

పెళ్లకూరు, జూలై 29: గత వైసీపీ పాలనలో అణచివేతకు గురై దిష్టి బొమ్మల్లాగా మారిన పంచాయతీ ప్రథమ పౌరులు సర్పంచులకు సముచిత స్థానం కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర సంచాలకుడు కృష్ణతేజను కోరినట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కె.శివకుమార్ తెలిపారు. అమరావతిలో సోమవారం దీనిపై పలువురు సర్పంచులతో కలసి ఆయనకు వినతి పత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా కేరళ తరహాలో రాష్ట్ర పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి చేయూతనివ్వాలని కోరానన్నారు. ఉపాధి హామీ పథకం పనులను సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సర్పంచుల గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాలని కోరామన్నారు. స్పందించిన రాష్ట్ర సంచాలకుడు కృష్ణతేజ... సమస్యలను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని, నిధులు, అధికారాలు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు శివకుమార్ తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ వద్ద జరిగిన ధర్నా

గూడూరు అర్బన్, జూలై 29: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ, చేనేత కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించాలన్నారు. నైపుణ్యాల రాయితీని రూ.2వేలు నుంచి రూ.3వేలుకు పెంచి ఇవ్వాలని, ముద్రా రుణాలు ఇచ్చినప్పుడే రాయితీ ఇవ్వాలన్నారు. చేనేత వస్త్ర ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. చేనేతలకు ప్రత్యేక బ్యాంకులు ఏర్పాటు చేసి రాయితీలో రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శశి, కాలేషా, చంద్రయ్య, నారాయణ, భాస్కర్, కోటయ్య, యశదమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



పెన్నేపల్లి వద్ద అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెళ్లకూరు, జూలై 29 : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని ఎస్‌ఐ శ్రీకాంత్ సూచించారు. సోమవారం పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై హెల్మెట్ వినియోగంపై వాహనదారుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెయ్యదూడల ఉత్పత్తులపై అవగాహన



మహిళా రైతుకు మినరల్ మిక్చర్ ప్యాకెట్టును అందిస్తున్న నాయకులు

కోట, జూలై 29: మండలంలోని గూడలిలో సోమవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పెయ్యదూడల ఉత్పత్తి అవగాహన కల్పించారు. అలాగే పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్థక శాఖ ఉమ్మడి నెల్లూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సోమయ్య ఆధ్వర్యంలో 79 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా గొంతువాపు, గాలికుంటు, నీలినాలుక, లంపీస్కిన్ తదితర వ్యాధులకు మందులను, మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. శిబిరాన్ని టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, వెంకటకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి ప్రారంభించగా పశువైద్యాధికారులు సుబ్రహ్మణ్యం, రాజేష్, సిరాజ్‌జాన్, ఉదయచైతన్య తదితరులు వైద్య సేవలందించారు.

భూములను ఇప్పించాలంటూ ఫిర్యాదు

కోట, జూలై 29 : మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీలో గల మైక్రోటవర్ కాలనీ వద్ద ఉన్న తమ భూములను ఆక్రమించుకున్నారని వెంటనే వాటికి మోక్షం కల్పించాలంటూ సోమవారం స్థానిక దళిత మహిళలు ఇన్‌చార్జి తహసీల్దారు మల్లికార్జున్‌రావుకు ఫిర్యాదు చేశారు. మైక్రోటవర్ కాలనీ సమీపంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన 4 ఎకరాల భూములను కొంతమంది కబ్జాచేసి తమ భూముల్లో కులుపుకున్నారని వాపోయారు. స్పందించి భూస్వాముల ఆధీనంలో ఉన్న తమ భూములను అప్పగించి ఆదుకోవాలని కోరారు.

జోరుగా క్రికెట్ టోర్నీ

చిల్లకూరు, జూలై 29: మండలంలోని మోమిడి గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు జోరుగా సాగుతున్నాయి. ఉదయం ఈపూరు వెంకన్నపాళెం-గుమ్మళ్ల దిబ్బ కొత్తూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఈపూరు వెంకన్నపాళెం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 104 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుమ్మళ్ల దిబ్బ కొత్తూరు జట్టు 11.1 ఓవర్లలో 74 పరుగులకు ఆలౌటైంది. మధ్యాహ్నం గుణపాటిపాళెం - తూపిలిపాళెం జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన గుణపాటిపాళెం జట్టు 11 ఓవర్లకు 67 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన తూపిలిపాళెం జట్టు 10.1 ఓవర్లలో 43 పరుగులు మాత్రమే చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గూడూరు, జూలై 29: స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... ఒంగోలుకు చెందిన హరిప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి తిరుమల నుంచి ఒంగోలుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద నెల్లూరు నుంచి గూడూరు పట్టణంలోకి అకస్మాత్తుగా కారు రావడంతో అదుపుతప్పి బైక్ ఢీకొనింది. దీంతో బైక్‌పై వెళుతున్న హరిప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి గాయపడ్డారు. వీరిని చికిత్సనిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కామ్రేడ్ జనార్దన రెడ్డికి ఘన నివాళి



గూడూరు, జూలై 29: పేదల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ జనార్దన రెడ్డి ఎన్నో పోరాటాలను చేశారని సీపీఎం నాయకులు చెప్పారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం సీపీఎం నాయకుడు జనార్దన రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనకు నాయకులు ఘన నివాళి అర్పించారు. వెంకట్రామిరెడ్డి, శంకరయ్య, శ్రీనివాసులు, సురేష్, మణి, నరసింహులు, చంద్రయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుగా అడ్డంగా రైల్వే అండర్ బ్రిడ్జి దిమ్మెలు

వాహన చోదకులకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, జూలై 29: రోజు రోజుకు విస్తరిస్తున్న సూళ్లూరుపేట పట్టణం ట్రాఫిక్ కష్టాల్లో చిక్కుకుంటోంది. పట్టణ నడిబొడ్డున రైల్వేట్రాక్ ఉండడయే దీనికి ప్రధాన కారణం. పట్టణం విస్తరించడంతో పాటు పెరిగిన జనాభా, వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించేందుకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. చకాచకా పనులు ప్రారంభించారు. అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పట్టణం ఇబ్బందికర పరిస్థితిలోకి వెళ్తుందని పలువురు కోర్టును ఆశ్రయించడంతో పనులకు బ్రేక్ పడింది. ఆ బ్రిడ్జి నిర్మాణానికి తెచ్చిన భారీ సిమెంట్ దిమ్మెలు రైల్వే గేటుకు రెండు వైపులా నడిరోడ్డుపై వదిలేయడంతో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైల్వే గేటుకు దక్షిణ వైపున ఉన్న రోడ్డులో ఆ దిమ్మెలు అడ్డంగా ఉండడంతో ఒక్కోసారి పాదచారులు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి. రైల్వేగేటు వేసిన, తీసిన సమయంలో ద్విచక్ర వాహనాలు రెండు వైపులా బారులు తీరుతాయి. సిమెంట్ దిమ్మెలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేదెప్పుడో... అడ్డంగా ఉన్న ఈ దిమ్మెలు తొలిగించేదెప్పుడో... అంటూ పట్టణవాసుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న అండర్ బ్రిడ్జికు సంబంధించిన సిమెంట్ దిమ్మెలను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.





రైల్వేగేటు దక్షిణ వైపున రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంట్ దిమ్మెలు - అడ్డంగా దిమ్మెలతో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

రిలీవర్ రాక ముందే ఇంటికి...!

- గునపాటిపాళెం పీహెచ్‌సీలో ఇదీ పరిస్థితి



వృద్ధురాలిని వేరే ఆసుపత్రికి తీసుకెళ్తున్న బంధువులు

చిట్టమూరు, జులై 29: రోగులకు అందుబాటులో ఉండి వారికొచ్చిన వ్యాధిని గుర్తించి నయం చేయాల్సి సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులను ఆసుపత్రిలోనే వదిలేసి తట్టా... బుట్టా సర్దుకొని వెళ్లిపోతున్నారు గునపాటిపాళెం 24గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది. సోమవారం సాయంత్రం గునసాటిపాళెం నుంచి వృద్ధురాలిని ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు సక్రమంగా వైద్యం అందించకుండా సాయంత్రం 4 గంటలకు బ్యాగులు సర్దుకొని వెళ్లిపోయారు. అదే సమయంలో కోట మండలం ఊనుగుంటపాళెం నుంచి ఓ రోగిని అత్యవసర చికిత్స కోసం ఆటోలో ఈ ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది లేరని వాచ్‌మేన్ చెప్పడంతో బతుకుజీవుడా అంటూ నాయుడుపేటకు తీసుకెళ్లారు.

షిఫ్ట్ విధానంలో సిబ్బంది నిర్లక్ష్యం...

గునపాటిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వర్తించాలి. ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులున్నారు. ప్రధాన వైద్యాధికారి సాయంత్రం 4 గంటల్లోపే వెళ్లిపోయినట్లు తెలిసింది. దాంతో ఓపీలో ఉండాల్సిన సిబ్బంది రిలీవర్ వచ్చే వరకు ఆసుపత్రిలో ఉండకుండా వెళ్లిపోయారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అత్తివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వీట్ల పంపిణీ

ఓజిలి, జూలై 29: మండలంలోని అత్తివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.గోపాల్‌రెడ్డి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల అభివృద్ధిలో

ముగిసిన శిక్షా సప్తాహ్

భాగంగా శిక్షా సప్తాహ్ పేరుతో వారం రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు సామాజిక భాగస్వామ్య దినం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వారం రోజులపాటు రోజూ విద్యార్థులకు ఆటల పోటీలతోపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు హెచ్‌ఎం టి.శోభనకుమారి తెలిపారు. సర్పంచి ఎస్.రమణయ్య, ఎ.గురుమూర్తి, అనిల్‌రెడ్డి సహా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయుడుపేట: వారం రోజులుగా జరుగుతున్న శిక్షా సప్తాహ్ సోమవారంతో పూర్తయినట్టు ఎంఈవో బి.మునిరత్నం తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యా బోధన, విద్యార్థులకు అనుగుణంగా సరళీకృత అభ్యాసాలపై శిక్షా సప్తాహ్ జరిగినట్లు తెలిపారు. నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ ముగింపు సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు గాలి రమేష్‌నాయుడు భోజన సదుపాయం కల్పించారు. హెచ్‌ఎం సురేష్ బాబు, న్యాయవాది పసల గంగాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలలో ప్రమాదకరంగా ఉన్న వృక్షాల తొలగింపు



ఎంజీసీ వద్ద వృక్షాలను తొలగిస్తున్న సిబ్బంది

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ప్రమాదకరంగా ఉన్న వృక్షాలను టీటీడీ ఫారెస్ట్ అధికారులు సోమవారం తొలగించారు. మూడు వారాలుగా తిరుమలలో భారీ ఈదురుగాలులకు కొన్ని వృక్షాలు కూలేందుకు సిద్ధమయ్యాయి. దీనిపై 'తిరుమలలో ప్రమాదకరంగా భారీ వృక్షాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఫారెస్టు అధికారులు కూలేందుకు సిద్ధంగా ఉన్న వృక్షాలను తొలగిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే కొండపై వృక్షాలను మూడు విభాగాలుగా విభజించామన్నారు. మొదటి విభాగం కింద పుచ్చిపోయిన, పూర్తిగా చనిపోయిన చెట్లు ఉంటాయన్నారు. రెండో భాగంలో కొంతమేరకు దెబ్బతిన్న, సున్నితంగా ఉన్న వృక్షాలు, మూడో విభాగంలో బరువు అధికంగా ఉండి బలంగా ఉన్న చెట్లు ఉంటాయన్నారు. కొద్దినెలలుగా మొదటి విభాగంలోని వృక్షాలను తొలగిస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

ముస్తాబవుతున్న 'అన్నమయ్య' మీటింగ్ హాల్



తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అధికారులు, బోర్డు సమావేశాలు జరిగే అన్నమయ్య భవనంలోని సమావేశం మందిరం (మీటింగ్ హాల్) ముస్తాబవుతోంది. బోర్డు సమావేశాలతోపాటు డయల్ యువర్ ఈవో, ఈవో, జేఈవోల సాధారణ సమావేశాలన్నీ ఈ సమావేశం మందిరంలోనే జరుగుతుంటాయి. ఈ హాల్ మరమ్మతులకు గురవడంతో కొద్దినెలల క్రితం ఆధునీకరణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పనులు దాదాపుగా పూర్తకావచ్చాయి. దీంతో మీటింగ్ హాల్‌ను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయండి

కలెక్టర్‌కు ఆపస్ నేతల విజ్ఞప్తి

తిరుపతి(విద్య), జూలై 29: జిల్లాలో ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన్ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజి, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ ఎం. దేవరాజులు, మహిళా కన్వీనర్లు లత, సౌజన్య, కప్పన, విజన్ కన్వీనర్ దాము తదితరులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 79,327 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,894 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో శ్రీవాణి టికెట్ల జారీకి శాశ్వత కౌంటర్

స్థలాలను పరిశీలించిన అదనపు ఈవో

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవాణి ట్రస్టు భక్తులకు దర్శన టికెట్లు కేటాయించేందుకు శాశ్వత కౌంటర్ నిర్మాణం కోసం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పలు ప్రాంతాలను పరిశీలించారు. గోకులం వెనుకభాగంలోని ఉన్న ఖాళీ స్థలాన్ని, ఆదిశేష విశ్రాంతి గృహం పక్కనే ఉన్న టీటీడీ కల్యాణమండపం ప్రాంతం, తిరుమల డీఎఫ్‌వో కార్యాలయాన్ని జేఈవో వీరబ్రహ్మంతో కలిసి సోమవారం పరిశీలించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా విశాలమైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో సెల్వం, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

తిరుపతి (జీవకోన), జూలై 29: రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ మాజీ సీఎం జగన్ నిర్వీర్యం చేశాడని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ తగులబెట్టడంపై ఆగ్రహించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఆంధ్రాలో ఓ కుటుంబం, తెలంగాణలో ఓ కుటుంబం వల్లే తెలుగు ప్రజలు కష్టాలు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ కొనసాగిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై టీటీడీ ఏడీ బిల్డింగ్ ముందు కూడా చింతామోహన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

1న విష్ణు సహస్ర నామ అఖండ జప యజ్ఞం

తిరుపతి (జీవకోన), జూలై 29: ఆలిండియా విష్ణు సహస్ర నామ కల్చరల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీన తిరుమల ఆస్థాన మండపంలో విష్ణు సహస్రనామ అఖండ జప యజ్ఞం చేపడుతున్నట్లు ఫెడరేషన్ చైర్మన్ నాగేంద్రసాయి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జనహితం కోరుతూ 35 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. 1న ఉదయం ఆరు గంటల నుంచి మొదలుపెట్టి రెండో తేదీ ఉదయం 10గంటల వరకు నిరంతరాయంగా 27 గంటలపాటు జపయజ్ఞం జరుగుతుందన్నారు. తిరుమల జీయరు స్వాములతో యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. ముగింపు కార్యక్రమానికి అహోబిలం జీయర్ స్వామి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ హాజరవుతారన్నారు.

జూపార్కులో పులుల దినోత్సవం

మంగళం, జూలై 29: ఎస్వీ జూపార్కులో సోమవారం ప్రపంచ పులుల దినోత్సవం సెట్విన్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులులను పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జూ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ.. విద్యార్థులకు పెద్దపులుల ప్రాధాన్యం, అడవులు ప్రాముఖ్యతను వివరించారు. అధికారులు జగదీష్, నాగభూషణం, మురళీకృష్ణ, చంద్రప్రసాద్ పాల్గొన్నారు.


అధిక లోడ్‌తో ప్రయాణిస్తే చర్యలు

వెంకటగిరి టౌన్, జూలై 29: వాహనాలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు అధిక లోడ్‌తో తోలితే చర్యలు తప్పవని ఎస్‌ఐ జిత్యానాయక్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఎన్‌జేఆర్ సర్కిల్, రాణిపేట, క్రాస్ రోడ్డు, పాలకేంద్రం, రాపూరు క్రాస్ రోడ్డు వద్ద అధిక లోడ్ వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తనిఖీల సందర్భంగా వాహన సర్టిఫికెట్లను తప్పని సరిగా చూపించాలన్నారు. పాఠశాల ఆటో, వాహనాలు అధిక లోడ్‌తో కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 10 వాహనాలకు జరిమానా విధించారు.



ఆటో డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ

డిగ్రీ కళాశాలలో టైగర్స్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

సూళ్లూరుపేట, జూలై 29: పట్టణంలోని వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ టైగర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల జంతుశాస్త్రం, ఎకో క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరి రక్షణలో పులుల పాత్ర కూడా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పులుల సంఖ్య క్రమేపి తగ్గిపోతోందని, వాటిని సంరక్షించేందుకే కేంద్రప్రభుత్వం టైగర్ ప్రాజెక్టును ప్రవేశపెట్టిందన్నారు. దీని వల్ల ప్రస్తుతం పులుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మన దేశంలోనే 70 శాతానికి పైగా పులులు ఉన్నాయని అంచనా వేశారన్నారు. అధ్యాపకులు శ్రీనివాస్, సుబ్రమణ్యం శాస్త్రి, డాక్టర్ బీకే ప్రసాద్, ఆర్ శరత్‌బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న శారద

నాయుడుపేట టౌన్, జూలై 29: ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధికలాభాలు ఉంటాయని మండల ఉద్యాన వన శాఖ అధికారి శారద అన్నారు. నాయుడుపేట ఉద్యానవనశాఖ కార్యాలయంలో సోమవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుకు హెక్టార్‌కు 150 మొక్కలు నాటుకోవాలని తెలిపారు. సాగులో 5వ విడత నుంచి హెక్టారుకు రెండు టన్నుల నుంచి 10 టన్నులు వరకు దిగుబడి వస్తుందన్నారు.

పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదు



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట, జూలై 29: ప్రభుత్వం ఏర్పడి 55 రోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడు పేటలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం పథకాలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయే తప్ప నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ ఆజీ చైర్మన్ జనార్దన రెడ్డి, టి.సుబ్రహ్మణ్యంరెడ్డి, కె.జయరామ్, చదలవాడ కుమార్, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు భూముల పరిశీలన

పెళ్లకూరు, జూలై 29: మండలంలో ల్యాండ్ కన్వర్షన్ కోసం విన్నవించుకున్న వ్యవసాయ భూములను ఆర్డీవో చంద్రముని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనకవోలు గ్రామానికి చేరుకుని స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం అక్కగారిపేటలో ల్యాండ్ కన్వర్షన్ కోసం కోరిన లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. అనుమతి లేకుండా లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ప్రహరీ నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి పూర్తి స్థాయి నివేదిక తనకు పంపించాలని తహసీల్దార్ ప్రసాదరావ్, వీఆర్వో మొబీనాను ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించిన లేఅవుట్ నిర్వాహకులను జరిమానాతో కూడిన అనుమతులు మంజూరు చేసేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. అన్నీ అనుమతులు వచ్చిన తరువాత పనులు ప్రారంభించాలన్నారు. వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ పూజిత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడిపై పోక్సో కేసు నమోదు

నాయుడుపేట టౌన్, జూలై 29 : లైంగిక దాడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని ఓ గ్రామంలో బాలికపై ఇద్దరు బాలురు లైంగికదాడి చేసినట్లు పేర్కొన్నారు. ఆ బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి బాలురపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిమెంటు రోడ్లు నిర్మించండి

వెంకటగిరిటౌన్, జూలై 29: స్థానిక 14వ వార్డుల్లో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించాలని 14వ వార్డు ప్రజలు కౌన్సిలర్ శంకరయ్యను కోరారు. సోమవారం 8వ సచివాలయంలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ... పట్టణంలో పారిశుధ్యం క్షీణించిందన్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది మురుగనీటి కాలువల్లో పూడిక తీయకపోవడం వలన దోమలు వృద్ధి చెంది స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే పందుల సంచారం పెరిగిందన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని వార్డు ప్రజలకు భరోసా కల్పించారు.

బాలుర గురుకులానికి కుర్చీల వితరణ



నాయుడుపేట, జూలై 29: పట్టణంలోని ఎల్‌ఏ సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలకు రూ.50 వేల విలువైన కుర్చీలను స్థానిక జైన్ సంఘ నాయకులు సోమవారం అందజేశారు. గురుకులంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా గురుకుల ప్రిన్సిపాల్ దాదాపీర్ జైన్ సంఘ నాయకులను సంప్రదించగా వారు ఈ మేరకు చేయూత అందించారు. ఇకపై కూడా సహాయ సహకారాలు అందిస్తామని సంఘ నాయకులు కుషాల్‌సింగ్, వికట్‌సింగ్, ముకన్‌సింగ్, అశోక్‌సింగ్, దినేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, బి.శేఖర్, వెంకటరమణ, వెంకటకృష్ణయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ సారె

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి తిరుమల శ్రీవారి తరఫున పట్టువస్త్రాలను టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం సమర్పించారు. టీటీడీ అధికారులకు తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ చైర్మన్ శ్రీధర్, జాయింట్ కమిషనర్ అరుణాచలం, తిరుత్తణి ఆలయ బోర్డు సభ్యులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈవోతోపాటు డిప్యూటీ ఈవో లోకనాథం, పారుపత్తేదార్ తులసి ప్రసాద్, వేదపారాయణదారులు ఉన్నారు.